జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php








సంపుటి 7 సంచిక 205 | హైదరాబాద్, అక్టోబరు 06 శుక్రవారం 2023 | 8 పేజీలు | వెల : 5.00




# మ్యానిఫెస్టోల మేనియా..

## తుది రూపుకు బీఆర్ఎస్ ఎన్నికల ప్రణాళిక

హైదరాబాద్, : తెలంగాణలో ఎన్నికలకు ముహూర్తం సమీపిస్తోంది. మ్యానిఫెస్టోల మేనియాకు పార్టీలు సిద్ధమయ్యాయి. ప్రజలంతా ఆసక్తితో ఏ పార్టీ ఏం ప్రకటిస్తుందోనని వేచిచూస్తున్నారు. ఈ క్రమంలో అన్ని పార్టీలు ఎన్నికల సమరానికి రెడీ అయిపోగా, బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే ఓ అడుగు ముందుకేసి 115 నియోజక వర్గాలకు అభ్యర్థులను కూడా ప్రకటించింది. ఈ నెల 16న వరంగల్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు- చేసేందుకు సిద్ధమైంది. ముఖ్యంగా రైతులు, యువతతో పాటు మహిళలపై దృష్టి సారించి వారిని ఆకట్టుకునేలా మేనిఫెస్టో తయారి తుదిరూపులో గులాబీ బాస్ నిమగ్నమయ్యారు. మ్యానిఫెస్టోలో ప్రకటించే హామీలకు ఎంత ఖర్చువుతుందనే అంశాలపై సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పలు వర్గాలకు చెందిన నిపుణులతో చర్చిస్తూనే సాధ్యాసాధ్యాలపై లెక్కలు రెడీ చేస్తున్నారు. ఇప్పటికే పాత, కొత్త పథకాలతో మ్యానిఫెస్టో తుది రూపుకు తెచ్చారు.


సంప్రదింపులు, వాస్తవికతో లెక్కలు ప్రజాకర్శక పథకాలపై బీఆర్ఎస్ సుప్రీం రైటిర్డ్ ఐఏఎస్‌లు, ప్రొఫెసర్లు, ఆర్థిక నిపుణులు, వివిధ రంగాల నిష్ణాతులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఇప్పుడున్న సంక్షేమ పథకాలను మరింత పెంచడంతోపాటు కొత్తగా నాలుగదు స్కీములకు అంకురార్పణ చేయనున్నారని తెలిసింది. ఆయా పథకాలను ప్రకటిస్తే ఖజానాపై ఎంత భారం పడుతుందనే అంచనాలను రూపొందిస్తున్నారు. ప్రాజెక్టులు, ఇతర ముఖ్యమైన పథకాలకయ్యే వ్యయాలపై లెక్కలేస్తున్నారు. గత వారం రోజులుగా ప్రగతిభవన్‌కు సీనియర్లను పిలిపించుకుని మ్యానిఫెస్టోపై కసరత్తు చేస్తున్నారు.

సూపర్బ్ పథకాలతో

అందులో రైతులకు ఉచితంగా ఎరువులు అందించడం, నిరుద్యోగ భృతి, ఆసరా పింఛన్ల పెంపుదల, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పెంపుదల తదితర అనేక పథకాలు ఉన్నట్లు తెలిసింది. రైతుబంధు సాయం ఎకరానికి మరో రూ.1000 పెంచడంతోపాటు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాన్ని రూ.1.25లక్షలకు పెంచనున్నారని సమాచారం. వృద్ధాప్య, వితంతు పింఛన్లను మరో రూ.1000 పెంచే అంశం పరిశీలిస్తున్నారు. రైతులకు అండగా నిల్చేలా రైతు పింఛన్, మహిళలకు మహిళా పింఛన్, గ్యాస్ సబ్సిడీ పెంచే ప్రతిపాదనలు ఉన్నాయి. వ్యవసాయ కూలీలు, కౌలు రైతులకు సర్కార్ అండగా నిల్చేలా ఒక పథకం ప్రకటించనున్నారని తెలిసింది. పెట్రోల్, డీజిల్‌పై రాష్ట్ర పన్ను వాటా వ్యాట్‌ను కొంత సడలించే అవకాశం ఉంది. ఆరు గ్యారెంటీలను మరిపించేలా ఇటీ-వల తెలంగాణా కాంగ్రెస్ తుక్కుగూడ బహిరంగ సభలో ఆరు గ్యారంటీలను ప్రకటించింది. (మిగతా 2లో..)

## 'నిఘా నేత్రం' నీడలో ఉప్పల్ స్టేడియం..

### 1,500 మందితో భారీ భద్రత..



హైదరాబాద్, అక్టోబర్ 05: ఉప్పల్‌లో జరగబోయే వన్డే వరల్డ్ కప్ మ్యాచ్‌ల కోసం రంగం సిద్ధమైంది. వివిధ దేశాల నుంచి వచ్చే ఆటగాళ్ల కోసం భారీ భద్రతను ఏర్పాటు చేశారు. శుక్ర, సోమ, మంగళవారాల్లో మ్యాచ్‌లు జరగనున్న నేపథ్యంలో అభిమానులు, క్రికెట్ జట్ల భద్రత కోసం హైదరాబాద్ పోలీసులు పలు ఏర్పాట్లు చేశారు.ఇందు కోసం 12వందల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లుగా రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ తెలిపారు. ఐపీఎల్ నిర్వహించిన విధంగానే వరల్డ్ కప్ మ్యాచ్ లను ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహిస్తామన్నారు.. హెచ్‌సీఏ తో వారం రోజుల క్రితమే మీటింగ్ నిర్వహించామని తెలిపారు. ఉప్పల్ స్టేడియంలో మూడు వరల్డ్ కప్ మ్యాచులున్నాయని సీపీ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచే ప్రేక్షకులను గ్రౌండ్ లోకి అనుమతిస్తామన్నారు. శుక్రవారం నుంచి రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో వరల్డ్ కప్ మ్యాచ్ లు జరగనున్నాయి..

## బీజేపీలో ఎన్నికల జోష్..

### 14 కమిటీలకు చైర్మన్ల ప్రకటన.. హైదరాబాద్‌కు జేపీ నడ్డా..




హైదరాబాద్, : అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మిషన్ తెలంగాణను వేగవంతం చేసింది. ప్రధాని మోదీతో ఒకేవారంలో రెండు సభలు నిర్వహించి జోరుమీదున్న కమలదళం.. ఎన్నికల వరకూ అదే జోరును కొనసాగించాలని భావిస్తోంది. ఈ క్రమంలో బీజేపీ వ్యూహంలో భాగంగా క్యాడర్‌కు బలమైన సంకేతం ఇచ్చేందుకు ఇవాళ బీజపీ జాతీయ అధక్షుడు జేపీ నడ్డా ఇవాళ హైదరాబాద్‌కు రానున్నారు. రేపు బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ భేటీ జరగనుంది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యేందుకు బీజేపీ జాతీయ అధ్యకుడు జేపీ నడ్డా గురువారం రాత్రి హైదరాబాద్ చేరుకుంటారు. అనంతరం కీలక నేతలతో నడ్డా భేటీ కానున్నారు. ముఖ్యంగా తెలంగాణ బీజేపీ గెలుపే లక్ష్యంగా నాయకులకు దిశానిర్దేశం చేయనున్నారు. ఇదిలాఉంటే.. కౌన్సిల్ సమావేశానికి ముందు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అధ్యక్షతన గురువారం పదాధికారుల సమావేశం ప్రారంభమైంది. జిల్లా, అసెంబ్లీ నిర్వహణ కమిటీల ఏర్పాటుపై ఈ సమావేశంలో చర్చ జరుగుతోంది. కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టే తీర్మానాలపై కూడా నేతలు చర్చిస్తున్నారు.ముఖ్యంగా పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తూ తెలంగాణ ఓటర్లను ప్రసన్నం చేసుకునే దిశగా కమలం పార్టీ పావులు కదుపుతోంది. మహబూబ్‌నగర్ సభలో ప్రధాని ప్రకటించిన జాతీయ పసుపు బోర్డుతో పాటు ములుగులో సమ్మక్క, సారక్క గిరిజన వర్సిటీ ఏర్పాటుకు కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. వీటితో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య కృష్ణా జలాల వాటా పంపిణీ బాధ్యతలను.. కృష్ణా జలాల వివాద పరిష్కార ట్రిబ్యునల్‌కు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల వాటాలో స్పష్టత వస్తే తెలంగాణలోని 50 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ నేపథ్యంలో నడ్డా పర్యటన తెలంగాణలో కీలకం కానుంది.

14 కమిటీలకు చైర్మన్ల ప్రకటన..

ఇదిలాఉంటే.. ఎన్నికల కోసం తెలంగాణ కమలదళం 14 కమిటీలను ప్రకటించింది. సీనియర్లు, అసంతృప్తులకు ప్రాధాన్యత ఇస్తూ కమిటీలను ప్రకటించింది. కొందరికి బుజ్జగింపులు చేస్తూనే.. మరికొందరి సీనియారిటీకి ప్రాధాన్యం ఇస్తూ బీజేపీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా అధికార పార్టీని ఎదుర్కొనే వ్యూహంలో భాగంగా కమలం పార్టీ ఎన్నికల కోసం ఏకంగా 14 కమిటీల చైర్మన్లను ప్రకటించింది.

## చర్యలు తీసుకోవాలని కేఆర్ఎంబీకి తెలంగాణ లేఖ..!




హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌పై కృష్ణా నది యాజమాన్య బోర్డుకు ఫిర్యాదు చేసింది. ఏపీ అక్రమంగా రాయలసీమ ఎత్తిపోతల పనులు చేపట్టిందంటూ కేఆర్ఎంబీకి తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల ఈఎన్‌సీ మురళీధర్ లేఖ రాశారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను ధిక్కరించి.. ఏపీ పనులను కొనసాగిస్తోందన్నారు. కృష్ణా బేసిన్ వెలుపలకు నీటిని తరలించే పనులు ఏపీ చేపడుతుందోని, 59 టీఎంసీల నీటిని తరలించేలా పనులు కొనసాగిస్తోందని ఈఎన్‌సీ లేఖలో ప్రస్తావించారు. అంతరాష్ట్ర ఒప్పందాలకు విరుద్ధంగా ఏపీ వ్యవహరిస్తోందని, పనులు కొనసాగితే తెలంగా ప్రాజెక్టులకు భారీగా నష్టం జరుగుతుందని ఈఎన్‌సీ తెలిపారు. తక్షణమే స్పందించి ఏపీ చేపడతున్న పనులను నిలిపివేయించాలని కోరారు.

## ఊకదంపుడు ఉపన్యాసాలతో రైతుల ఆదాయం డబుల్ కాదు.. మోదీపై మంత్రి కేటీఆర్ ధ్వజం




రంగారెడ్డి : రైతు ఆదాయం డబుల్ కావాలంటే నోటి మాటలతో ఊకదంపుడు ఉపన్యాసాలతో కాదు అని ప్రధాని నరేంద్ర మోదీపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. రైతుకు ధీమా ఇచ్చి సరైన ఆలోచన, విధానాలు అమలు చేసినప్పుడే రైతు ఆదాయం డబుల్ అవుతుంది. అందుకే సీఎం కేసీఆర్ పాడిని ప్రోత్సహిస్తున్నారు. పంటను ప్రోత్సహిస్తున్నారు. మినీ డెయిరీలను పెద్ద ఎత్తున ఎంకరేజ్ చేస్తున్నాం అని మంత్రి కేటీఆర్ తెలిపారు.రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని రావిర్యాల వద్ద దేశంలోనే అత్యాధునిక, ఆటోమేషన్ ప్రాసెసింగ్ టెక్నాలజీతో నిర్మించిన విజయ మెగా డెయిరీని మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ మెగా డెయిరీని 40 ఎకరాల విస్తీర్ణంలో రూ. 250 కోట్లతో నిర్మించారు. రోజుకు లక్ష లీటర్ల టెట్రా బిక్ పాల ఉత్పత్తి చేసేలా మిషనరీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో పాడి రైతులను ఉద్దేశించి మంత్రి కేటీఆర్ ప్రసంగించారు.

తెలంగాణలో తప్ప ఇతర రాష్ట్రాల్లో రైతుల కష్టాలు డబుల్

ప్రధాని నరేంద్ర మోదీ 2014లో ఒక మాట చెప్పారు.. అదేంటంటే 2022 నాటికి రైతుల ఆదాయం డబుల్ చేస్తానన్నాడని కేటీఆర్ గుర్తు చేశారు. రైతుల ఆదాయం డబుల్ అయిందా? అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో తప్ప ఇతర రాష్ట్రాల్లో రైతుల కష్టాలు డబుల్ అయ్యాయి. ఇతర రాష్ట్రాల్లో రైతుబంధు, రైతుబీమా, 24 గంటల కరెంట్ ఇవ్వలేని దుస్థితి నెలకొని ఉందని కేటీఆర్ తెలిపారు. మోదీ చెప్పినట్టు రైతుల ఆదాయం డబుల్ అయినా, కాకపోయినా.. తెలంగాణలో మాత్రం కేసీఆర్ నాయకత్వంలో పాడి రైతులకు గానీ, ఇతర రైతులందరికీ న్యాయం జరుగుతుంది. (మిగతా 2లో..)




## విజయా డైరీ విస్తరణ అడుగులు

హైదరాబాద్, అక్టోబరు 5, :రాష్ట్ర ప్రభుత్వ పాడి పరిశ్రమ అభివృద్ధి సమాఖ్య( విజయ డెయిరీ) విస్తరణకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కొన్నేళ్లుగా డైరీ కార్యకలాపాలు పెద్ద ఎత్తున హైదరాబాద్ కేంద్రంగానే కొనసాగుతున్నాయి. పాల సేకరణ తర్వాత హైదరాబాద్ కు రవాణా చేయడం, ఉత్పత్తుల తయారీ అనంతరం తిరిగి జిల్లాలకు పంపడం చేస్తున్నారు. దీంతో రవాణా, ఇతర సమస్యలను ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో డైరీ కార్యకలాపాలను 6 జోన్లుగా విభజించి వికేంద్రీకరణ విధానంలో సాగాలని భావిస్తుంది. తద్వారా పాల సేకరణ నుంచి ఉత్పత్తుల తయారీ వరకు డైరీ సామర్థ్యాన్ని మరింత పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. తెలంగాణ ఆవిర్భావ సమయంలో 64 ఉన్న విజయ డైరీ దుకాణాలు ఇప్పుడు 650 కి పెరిగాయి. వీటిని మరింతగా 1000కి పెంచాలని భావిస్తుంది.విజయ డైరీ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఇటీవల మంత్రి సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి విస్తరణ ప్రతిపాదనలపై చర్చించారు. నల్గొండ, వరంగల్, ఖమ్మం, మహబూబ్ నగర్, మెదక్, నిజామాబాద్ లుల్లో కొత్త జోన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ జోన్ల కేంద్రంగా పాల సేకరణ చేపడతారు. అక్కడే ఉత్పత్తి యూనిట్లు ప్రారంభిస్తారు. జోన్ల ఆధ్వర్యంలో మార్కెటింగ్ చేపడతారు.రోజుకు 5 నుంచి 8 లక్షల ప్రాసెసింగ్ సామర్థ్యంతో రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో 42 ఎకరాల్లో 250 కోట్లతో విజయ డైరీ మెగా ప్లాంట్ నిర్మిస్తున్నారు. త్వరలోనే ఇది అందుబాటులోకి రానుంది. ఈ కాలంలోనే విస్తరణ ప్రతిపాదనలను సైతం సిద్ధం చేశారు. విజయ డైరీ కోసం రాష్ట్రవ్యాప్తంగా పాల సహకార సంఘాల ద్వారా 4.5 లక్షల లీటర్ల ను సేకరిస్తుంది. పాలతో పాటు పాల ఆధారిత వివిధ ఉత్పత్తులను తయారుచేసి సొంత దుకాణాల ద్వారా విక్రయిస్తుంది. కొత్తగా విజయ ఐస్ క్రీమ్ తయారీ కి సిద్ధమవుతోంది.దేశంలో వ్యవసాయం తర్వాత వాడు పరిశ్రమరంగంపై అత్యధిక కుటుంబాలు జీవనోపాదం పొందుతున్నాయని మంత్రి తలసాని వెల్లడించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న 35, 500 అంగన్వాడీ కేంద్రాలకు విజయ డైరీ ఆధ్వర్యంలో పాల సరఫరాకు సంబంధించి మహిళ, సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి కలిసి విధి విధానాలపై ఇటీవల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ రంగంలోని విజయ తెలంగాణ డైరీ కార్పొరేట్ డైరీలకు దీటుగా మార్కెటింగ్ వ్యూహాలను అమలు చేయడం ద్వారా ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులో ఉంచే విధంగా అన్ని చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తలసాని తెలిపారు. విజయ డైరీ ద్వారా వివిధ ప్రభుత్వ సంస్థలకు పాల సరఫరా చేయడమే కాకుండా ఐసిడిఎస్ సెంటర్లకు కావాల్సిన 20 లక్షల లీటర్ల పాలను సరఫరా చేయడానికి అవసరమైన కార్యచరణ రూపొందించాలని ఈ సందర్భంగా మంత్రి అధికారులకు ఆదేశించారు. ప్రస్తుతం ఐసిడిఎస్ కేంద్రాలకు అవసరమైన పాలలో 5.5 లక్షల లీటర్ల పాలను విజయ డైరీ సరఫరా చేస్తుందని, అవసరమైన సిబ్బందిని నియమించేందుకు, పాల సేకరణకు కావలసిన సామర్థ్యాన్ని విజయ డైరీ సమకూర్చుకుంటుందని మంత్రి తెలిపారు.

## ప్రచారంలోనూ కమలం దూకుడు

నిజామాబాద్, అక్టోబరు 5 :తెలంగాణలో ఎన్నికల వేడి కనిపిస్తోంది. రాష్ట్రంలో నేటి నుంచి మూడు రోజులపాటు కేంద్ర ఎన్నికల సంఘం పర్యటిస్తోంది. ఈ పర్యటన తర్వాత అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌పై క్లారిటీ వచ్చే అవకాశం కనిపిస్తోంది. 7వ తేదీనే షెడ్యూల్ రావొచ్చన్న అంచనాలు కూడా ఉన్నాయి. దీంతో... రాజకీయ పార్టీలు వేగం పెంచాయి. బీఆర్ఎస్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించి.. ప్రచారంలో దూసుకుపోతోంది. ఇక... బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల జాబితాపై కసరత్తు చేస్తున్నాయి. కాంగ్రెస్ క్యాండిటేడ్స్‌ను దాదాపు ఖరారు చేసినట్టు తెలుస్తోంది. ఇక... బీజేపీ కూడా అభ్యర్థులను ఫైనల్ చేసే దిశగా కసరత్తు చేస్తోందివచ్చే వారంలో అభ్యర్థుల జాబితా ప్రకటించే అవకాశం ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రకటించారు.

దశల వారిగా జాబితాను ప్రకటిస్తామన్నారు. రాష్ట్రంలో ఈ నెల 5, 6 తేదీల్లో జరగబోయే పార్టీ సమావేశాలకు జాతీయ నేతలు హాజరవుతున్నట్లు చెప్పారు కిషన్‌రెడ్డి. సోమవారం ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసిన చాలా సేపు చర్చించారు కిషన్‌రెడ్డి. రాష్ట్ర ఎన్నికలకు సంబంధించి అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రచార సభలపై సమాలోచనలు చేసినట్టు సమాచారం. అలాగే... ప్రధాని సహా కేంద్రమంత్రుల పర్యటనలపై కూడా చర్చించారు అమిత్‌షా, కిషన్‌రెడ్డి. ఈనెల 5, 6 తేదీల్లో రాష్ట్ర స్థాయి సమావేశాలు ఉంటాయని చెప్పారు కిషన్‌రెడ్డి. 5న జరిగే సమావేశాలకు జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. అలాగే... 5వ తేదీ మీటింగ్‌కు జిల్లా అధ్యక్షులు, ఇంఛార్జులు, రాష్ట్ర పదాధికారులు హాజరవుతారన్నారు. ఇక... 6వ తేదీన స్టేట్ కౌన్సిల్ మీటింగ్ ఉంటుందని... ఈ సమావేశానికి పార్టీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని చెప్పారు. అసెంబ్లీ నియోజకవర్గాల కన్వీనర్లు, ఇంఛార్జులతో కలిసి 800మంది నేతలు హాజరవుతున్నారని.. వారందరికీ జేపీ నడ్డా దిశానిర్దేశం చేస్తారని చెప్పారు కిషన్‌రెడ్డి. ఇక, ఈనెల 10వ తేదీన తెలంగాణలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటన ఉంది. మంచిర్యాలలో ఏర్పాటు చేస్తున్న భారీ బహిరంగసభకు కూడా అమిత్‌షా హాజరవుతారు. అటు అభ్యర్థుల జాబితా ఫైనల్ చేస్తూనే...ఇటు ప్రచార కార్యక్రమాలపై ఫోకస్ పెట్టింది కమలం పార్టీ. రాష్ట్రంలో అగ్రనేతల పర్యటనలతో ప్రచారంలో జోరు పెంచింది. ఇప్పటికే ప్రధాని మోడీ తెలంగాణలో పర్యటించారు. మహబూబ్‌నగర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అలాగే ఎన్నికల వేళ తెలంగాణపై వరాల జల్లు కురిపించారు. గిరిజన యూనివర్సిటీతో పాటు పసుపు బోర్డును ప్రకటించారు.

# చేవెళ్లలోపండుగల సాయన్న నూతన విగ్రహాఆవిష్కరణ

### ముదిరాజులు అందరూ ఏకం కావాలి:"కాసాని జ్ఞానేశ్వర్ "
### పండుగల సాయన్న జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి.
### ఎమ్మెల్య కాలే యాదయ్య

చేవెళ్ల అక్టోబర్ 5,(ప్రజాపాలన): అని వర్గాలకోసం సాయన్న చేసిన సేవలు మరువలేవి.ముదిరాజుల లక్ష్యం రాజ్యాధికారం ఒక్కటే అని, బిత్తిరి సత్తి,కాసాని జ్ఞానేశ్వర్ లు పేర్కొన్నారు.చేవెళ్లమండలకేంద్రంలో శంకర్ పల్లి చౌరస్తా లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పండుగ సాయన్న విగ్రహ ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాఆవిష్కరణ కార్యక్రమానికి అతిధులుగా కాసాని జ్ఞానేశ్వర్,నీలం మధు,బిత్తిరి సత్తి (రవికుమార్ ),స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య లు పాల్గొన్ని విగ్రహాఆవిష్కరణ చేసిన అనంతరం కెజిఆర్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ. భూస్వామ్య వ్యవ్థను ఎదురించి ప్రజల పక్షాన నిలిచిన గొప్ప దిరుడని, ఆయన త్యాగం మరువలేనిదని అన్నారు.ముదిరాజు లు అందరూ ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ముదిరాజ్ ల హక్కులు డిమాండ్లు, సమస్యలు పరిష్కారం కొసం ఎకతాటి పైకి వచ్చి ఫోరాటం చేయాలన్నారు. బడుగు బలహీనర్గాలకు ఆదర్శంగా నిలిచిన పండుగ సాయన్న జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని వారు పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో 60 లక్షల జనాభా కలిగిన ముదిరాజులకు ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా ఇవ్వని బిఆర్ఎస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెప్తామని ముదిరాజులకు ప్రాధాన్యత ఇచ్చిన పార్టీలకు అండగా ఉంటామన్నారు. మన జీవితాలతో చెలగాటమాడి మనల్ని అణిచివేసే పాలకులకు మరియు పార్టీలకు ముదిరాజుల సత్తా చూపించాలన్నారు. టిడిపి పార్టీ నుంచి 11 మంది ముదిరాజులకు ఎమ్మెల్యే అభ్యర్థులుగా అలాగే బీసీలకు మొత్తం 60 సీట్లు కేటాయిస్తామన్నారు. పండుగ సాయన్న చరిత్రను ప్రతి ఒక్కరు తెలుసుకొని వారి ఆశయ సాధన కోసం కృషి చేయాలి అన్నారు. సమాజంలో నిజమైన హీరోలు ప్రజల గండాలను తీర్చి గుండం పక్కన వెలిసిన మహనీయులు వాళ్ళు నిజమైన హీరోలు. అణగారిన వర్గాలకు సాయన్న ఎనలేని సేవ చేశారని ఉన్నవారిని దోచి లేని వానికి పెట్టి తెలంగాణ రాబిన్ హుడ్ గా చరిత్రలో నిలిచారన్నారు. ముదిరాజులు సంబాండవర్గాలందరినీ కలుపుకొని రాజ్యాధికారం దిశగా పయనించాలన్నారు. ముదిరాజులు రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. ముదిరాజులు సంఘటితంగా పోరాటం చేసి తమ హక్కులను సాధించుకోవాలన్నారు.. యువత పైకి రావాలని వారు రాజకీయంగా ముందుకు వస్తే సమాజం బాగుపడుతుందని అన్నారు.బిత్తిరి సత్తి తను చేవెళ్ల లో ఎవరెవరి షాప్ లలో కూర్చుంనానో



అని తన మిత్రులు మద్దెల సురేందర్ ను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజి ఎంపీకొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం,జగన్ మోహన్, రాజు, తలారి మల్లేష్,లాలు ముదిరాజ్, భూపన్న, బండారి శ్రీనివాస్, జంగయ్య, కాసాని వీరేష్, రాజు, నర్సిములు, వెంకటయ్య, పాల్గొన్నారు..

# మ్యానిఫెస్టోల మేనియా..

(మొదటి పేజీ తరువాయి)

ఆ స్కీములపై ఇప్పుడు ఓటర్లలో చర్చ కూడా జరుగుతోంది. దీంతో బీఆర్ఎస్ కూడా కొత్త పథకాలతో ఆకట్టుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. బీఆర్ఎస్ మేనిఫెస్టోలో కొత్త పథకాలతో పాటు ప్రస్తుతం ఉన్న పథకాలకు మరింత ప్రయోజనం చేకూరేలా ప్రకటన ఉంటుందని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. రైతుబంధు తరహాలో రెండు వ్యవసాయ సీజన్లలో రైతులకు ఉచితంగా ఎరువులు (యూరియా, డీఏపీ, ఎన్‌పీకే) లను ప్రకటించాలని సీఎం భావిస్తున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. అన్ని రకాల ఆసరా పింఛన్లను రూ.1,000 పెంచాలని కూడా సీఎం యోచిస్తున్నట్లు సమాచారం. ఇటీవల వికలాంగుల పెన్షన్‌ను నెలకు రూ.3,016 నుంచి రూ.4,016కు పెంచగా.. మిగతా వారికి కూడా రూ.వెయ్యి పెంచేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

తగ్గిన జ్వరం..రంగంలోకి గులాబీ దళపతి

కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్న గులాబీ దళపతి, సీఎం కేసీఆర్ త్వరలో రంగంలోకి దిగనున్నారు. త్వరలో కేబినెట్ సమావేశం నిర్వహించి కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. ఈనెల 16న వరంగల్‌లో జరగనున్న విజయగర్జన సభలో ప్రకటించనున్న మేనిఫెస్టోకు తుది మెరుగులు దిద్దుతున్నారు. రైతులకు ఫించను, ఉచితంగా ఎరువుల పంపిణీ, మహిళలు, యువత, బీసీలు, మైనారిటీలకు పలు ఎన్నికల హామీలను ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.ఎన్నికల షెడ్యూలు వచ్చిన తర్వాత కేసీఆర్ కూడా సుమారు వంద నియోజకవర్గాల్లో పర్యటించేలా ప్రణాళికలు చేస్తున్నట్లు సమాచారం. గోవా- కర్ణాటక, ఏపీ-తెలంగాణ, పంజాబ్ - హర్యానా - రాజస్థాన్-హిమాచల్ ప్రదేశ్, కేరళ-తమిళనాడు, తమిళనాడు-కర్ణాటక మధ్య జలవివాదాలెకు కేంద్రమే కారణమని, ఈ వైఫల్యాలను ఎండగట్టే ఎజెండాతో గులాబీ పార్టీ ఎన్నికలకు వెళ్లాలనుకుంటోంది. పదేళ్లలో తెలంగాణ ప్రభుత్వం సాధించిన ఫలితాలను భవిష్యత్తులో దేశానికి అందివ్వాలని బీఆర్ఎస్ భావిస్తోంది. అందుకోసం తెలంగాణ నమూనాను ఆదర్శంగా చూపిస్తూ మేనిఫెస్టోను రూపొందించాలని సీఎం కేసీఆర్ భావిస్తున్నారు. వ్యవసాయాన్ని బలోపేతం చేయడం కోసం దేశానికి 24గంటల విద్యుత్ సరఫరా హామీని బీఆర్ఎస్ ఎన్నికల హామీలో చేర్చనుంది. పారిశ్రామిక అభివృద్ధి ద్వారా నిరుద్యోగ సమస్యకు చెక్ పెడతామనే హామీని మేనిఫెస్టోలో చేర్చనుంది బీఆర్ఎస్. ఈ నేపథ్యంలోనే దాదాపు రెండు వారాలుగా సీఎం కేసీఆర్ మేనిఫెస్టో రూపకల్పనపై వివిధ రంగాలకు చెందిన నిపుణులతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

బ్రహ్మాండమైన పథకాలతో ప్రజల్లోకి

వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షాలను ఎదుర్కొనేందుకు తమ వద్ద బ్రహ్మాండమైన పథకాలున్నాయని చెప్పిన బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ అన్నరది అన్నట్లుగా రెడీ అవుతున్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టో కసరత్తు దాదాపు పూర్తైనట్లు సమాచారం. ముఖ్యంగా రైతులు, యువతతో పాటు మహిళలపై దృష్టి సారించి వారిని ఆకట్టుకునేలా పార్టీ ఎన్నికల హామీలు ఉండనున్నట్లు తెలిసింది.

కర్ణాటక తరహాలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థినులకు సైకిళ్లు, శానిటరీ న్యాప్‌కిన్లు ఉచితంగా పంపిణీ చేసే ప్రతిపాదనను పార్టీ పరిశీలిస్తోంది. ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీల కళ్లు తిరిగేలా బీఆర్ఎస్ మేనిఫెస్టోను తీసుకొని రావాలని ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే మంత్రి హరీశ్ రావు మేనిఫెస్టో విషయంలో ప్రజలకు లీకులు ఇచ్చారు. త్వరలోనే మరిన్ని శుభవార్తలు వింటారని, ప్రతిపక్షాల దిమ్మతిరిగేలా మేనిఫెస్టో ఉంటుందని చెప్పారు.

భారమెంత రాబడి ఎలా?

గత ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించి అమలు చేయని నిరుద్యోగ భృతిపైనా చర్చ జరుగుతున్నట్లు సమాచారం. నిరుద్యోగ యువత సంఖ్యపై స్పష్టత వచ్చిన తర్వాత సీఎం దీనిపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నట్లు పార్టీ కీలక నేత వెల్లడించారు. ఇలా బీఆర్ఎస్ పార్టీ అన్ని వర్గాలను ఆకట్టుకునేలా మేనిఫెస్టో రూపొందిస్తున్నట్లు తెలిసింది. యువతలో నిరుత్సాహాన్ని ప్రారదోలేలా సరికొత్త ఉపాధి పథకంపై పార్టీ ఆలోచనలు చేస్తోంది. నిరుద్యోగ భృతి నగదుగా కాకుండా స్కిల్ డెవలప్‌మెంట్, ప్రైవేట్ రంగంలో ఉపాధి కల్పనపై దృష్టిసారిస్తోంది. ప్రస్తుత పథకాలకు సాయం పెంచడంతోపాటు పాత, కొత్త పథకాలతో పడే ఆర్థిక భారం, రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న ఆర్థిక వెసులుబాటు, ప్రజాసంక్షేమం కోసం వివరించేందుకు బీఆర్ఎస్ అధినేత సిద్ధమవుతున్నారు.

## ఊకదంపుడు ఉపన్యాసాలతో రైతుల ఆదాయం డబుల్ కాదు.. మోదీపై మంత్రి కేటీఆర్ ధ్వజం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ తప్పకుండా పరిపుష్టం అవుతోంది. తప్పకుండా గ్రామాల్లో సంపద పెరుగుతుంది. ఆ పెరిగిన సంపదతో తెలంగాణ సస్యశ్యామలంగా ఉంటుందని కేటీఆర్ తెలిపారు.

తెలంగాణలో ఐదు విప్లవాలు ఆవిష్కృతం..

ఇవాళ తెలంగాణలో ఐదు విప్లవాలు మీ కళ్ల ముందే ఆవిష్కృతమవుతున్నాయని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. తద్వారా రైతుల ఆదాయం రెట్టింపు అయ్యే అవకాశం ఉంది. 2014లో కేవలం 68 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం ఉత్పత్తి అయ్యేది. ఇవాళ మూడున్నర కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుంది. పంజాబ్, హర్యానాను దాటిపోయి దేశానికే అన్నపూర్ణ అయింది మన తెలంగాణ. ఇది హరిత విప్లవం ద్వారా సాధించామని కేటీఆర్ పేర్కొన్నారు. ఇక రెండో విప్లవం నీలి విప్లవం.. మత్స్యశాఖ ఆధ్వర్యంలో కోట్లాది చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. మన మత్స్యకారులు కోట్లాది చేపలను పెంచుతున్నారు. దీంతో మత్స్య సంపద అపారంగా పెరిగింది. ఇన్ లాండ్ ఫిషరీస్‌లో భారతదేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని కేటీఆర్ తెలిపారు. లక్షన్నర లీటర్ల పాలు తీసుకునే విజయ డెయిరీ.. ఇప్పుడు 4 లక్షల లీటర్లకు చేరింది. ఇది 10 లక్షల లీటర్లకు కూడా చేరుకోవచ్చు. మీరు ఆదరిస్తే క్షీర విప్లవం వచ్చే అవకాశం ఉందన్నారు కేటీఆర్. గొర్రెల పంపిణీ కూడా చేపట్టాం. రూ. 11 వేల కోట్లతో యాదవ, కురుమ సోదరులకు గొర్రెలను అందిస్తున్నాం. తద్వారా మాంస ఉత్పత్తి అవుతోంది. అంటే గులాబీ విప్లవం వస్తుంది. దీంతో యాదవ, కురుమ సోదరులకు అదనపు ఆదాయం వచ్చేలా కృషి చేస్తున్నామని కేటీఆర్ తెలిపారు. ఇచ చివరిది.. ఎల్లో విప్లవం. అదే ఆయిల్ పామ్ రెవల్యూషన్.. 20 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ పంటను ప్రోత్సహిస్తున్నాం. రైతు ఆదాయం డబుల్ కావాలంటే ఈ ఐదు విప్లవాలు కలిసికట్టుగా నడిస్తే గ్రామీణ ప్రాంతాల్లో రైతు ఆదాయం రెట్టింపు అవుతుంది. ఈ ఐదు రకాల విప్లవాలు తెలంగాణలో మన కళ్ల ముందు సాక్షాత్కారం అవుతున్నాయి. అందుకే తెలంగాణ గ్రామాల్లో సంపద పెరిగిందని మంత్రి కేటీఆర్ వివరించారు.

## దుర్గం చెరువుపై సైక్లింగ్ వాక్తన్

### సైక్లింగ్ టు వోట్ - వాక్ టు వోట్ పేరుతో వాక్తన్



మాదాపూర్:బుధవారం నాడు హైదరాబాద్ దుర్గం చెరువుపై సైక్లింగ్ వాక్తన్ నిర్వహించారు. సైక్లింగ్ టు వోట్ - వాక్ టు వోట్ పేరుతో వాక్తన్ జరిగింది. ఈ కార్యక్రమంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఆఫ్ ఇండియా రాజీవ్ కుమార్, కమిషనర్లు అరుణ్ గొయల్ అనూప్ చంద్ర పాండ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్, సైబరాబాద్ సీపీ స్టిపెన్ రవీంద్ర, అధికారులు తదితరులు హజరయ్యారు. సైక్లిస్ట్ లు, వాకర్స్ భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలనే అవగాహన కార్యక్రమం నిర్వహిచారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ ముందు విద్యార్దులు ఓటు హక్కు వినియోగించుకోవాలని నాటకం ద్వారా చేసి చూపించారు అయన సైక్లిస్ట్ లతో ముచ్చటించారు. ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు.

## మండల రిసోర్స్ సెంటర్ ఎదుట నిరసన



శంకరపట్నం అక్టోబర్ 05 ప్రజాపాలన రిపోర్టర్: శంకరపట్నం మండలం కేంద్రంలోని మండల రిసోర్స్ సెంటర్ కార్యాలయం ముందు ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి పిట్టల సమ్మయ్య ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులు ధర్నా నిర్వహించారు. 16రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసనల్లో భాగంగా మండల విద్యాధికారికి వారి సమస్యలు విన్నవించుకోవడానికి కార్యాలయానికి రాగా ఎంఈఓ అందుబాటులో లేరని వాపోయారు. తమ డిమాండ్లను నెరవేర్చేవరకు సమ్మె విరమించమన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న బోజన వంట కార్మికులా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రజిత, మండల నాయకుడు బొజ్జ సాయిలు, అన్నీ పాటశాలల వంట కార్మికులు పాల్గొన్నారు.

## నేడు తల్లాడ మండలంలో ఎమ్మెల్యే సండ్ర పర్యటన..



తల్లాడ, అక్టోబర్ 5 (ప్రజాపాలన న్యూస్): తల్లాడ మండలంలో సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య శుక్రవారం పర్యటించనున్నారు. ఈ మేరకు మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఎమ్మెల్యే పర్యటనను బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు.

## బతుకమ్మ చీరల పంపిణీ



సంగారెడ్డి, ప్రజాపాలన ప్రతినిధి: సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డి పల్లి రోడ్ నంబర్ 3 లో ఉన్న కమ్యూనిటీ హాల్ లో మాజీ సీడీసీ చైర్మన్ విజయేందర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ రామప్ప బతుకమ్మ చీరలను మహిళలకు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో 31,32 వార్డులకు సంబంధించిన పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్ రామప్ప మాట్లాడుతూ కాలనీల్లోని మహిళలు తమ ఆధార్, రేషన్ కార్డులను వెంట తీసుకుని వచ్చి బతుకమ్మ చీరలను తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న పంపిణీని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## మొయినాబాద్ మండల్ అధ్యక్షులుగా రమేష్



చేవెళ్ల అక్టోబర్ 05,(ప్రజాపాలన):చేవెళ్ల నియోజక వర్గం మొయినాబాద్ సమతా సైనిక్ దళ్ మండల్ నూతన కమిటీ ఎన్నికను గురువారం మొయినాబాద్ మండలకేంద్రంలో సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్పుల మల్లేష్,జిల్లా అధ్యక్షులు మాచన్ పల్లి రామస్వామి ఆధ్వర్యంలో కార్యకర్తలు సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం మండల్ నూతన కమిటి అధ్యక్షులుగా శ్రీరాం నగర్ గ్రామానికి చెందిన కమ్మదానం రమేష్, ఉపాధ్యక్షులు గా ధనుష్,ప్రధాన కార్యదర్శి గా ప్రదీప్, కోశాధికారి గా విజయ్ కుమార్ లను నియమిస్తున్నట్లు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాంచెందర్, నరేష్,శంకర్,తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగులందరూ మద్దతు ఇవ్వండి



సంగారెడ్డి, ప్రజాపాలన ప్రతినిధి : రానున్న ఎన్నికల్లో రిటైర్డ్ ఉద్యోగులందరూ తనకు మద్దతు ఇవ్వాలని టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్ కోరారు. సంగారెడ్డి పట్టణంలోని టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగిన రిటైర్డ్ ఉద్యోగుల సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా ముఖ్యమంత్రి కేసీఆర్ తనను ప్రకటించారని, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, దేవీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లు సమస్యలు పరిష్కరించాలి: సి ఐ టి యు నాయకుల డిమాండ్



మంచిర్యాల టౌన్, అక్టోబర్ 05, ప్రజాపాలన : తెలంగాణ ఆశా వర్కర్లు సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్లు యూనియన్ సి ఐ టి యు నాయకులు అన్నారు. గురువారం రాష్ట్ర వ్యాప్త సమ్మె నిరసనలో భాగంగా 11 వ రోజు కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సమ్మక్క, శోభ లు మాట్లాడుతూ పారితోషకం పేరుతో మమ్మల్ని ప్రభుత్వం వెట్టిచాకిరీ చేపిస్తుందని ఉద్యోగ భద్రత, కనీస వేతనం లేదని వాపోయారు. ప్రజలకు సేవలు అందించే ఆశా వర్కర్లను ప్రభుత్వం పట్టించుకోకపోవడం చాలా దారుణం అని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య ప్రకాష్ సంకె రవి దుంపల రంజిత్ కుమార్ పుష్ప భాగ్య లీలావతి విజయలక్ష్మి స్రవంతి రాణి కవిత తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు



అశ్వరావుపేట ప్రజా పాలన (ప్రతినిధి) అశ్వారావుపేట మండలంలోని స్థానిక రైతు వేదిక భవనం దగ్గర గురువారం నిర్వహించినటువంటి బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో అశ్వారావుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని పంపిణీ చేశారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచులందరికీ కేసీఆర్ అన్నలాంటివాడని ఆడపడుచులందరికీ చీరలు ఇవ్వడం ఎక్కడ దేశంలో ఎక్కడా లేదన్నారు, అలాగే స్పోర్ట్స్ సంబంధించిన ఆట వస్తువులు యువకులకు పంచిపెట్టారు యువకులు మాట్లాడటం వలన మానసిక శారీరక ఉల్లాసాన్ని కలిగిస్తుందని ఆరోగ్యంగా దృఢంగా ఉంటారని ఆయన అన్నారు. ఇంకా కేసీఆర్ మనకు ఎన్నో దేశంలో ఎక్కడా లేని పథకాలు ప్రవేశపెడుతున్నారని దీన్ని అందరూ వినియోగించుకొని మళ్లీ మనం అధిక మెజారిటీతో సీఎం కేసీఆర్ ని గెలిపించాలని అన్నారు .ఈ కార్యక్రమానికి అశ్వారావుపేట మండల పరిషత్ అధ్యక్షులు జల్లిపల్లి శ్రీరామ్ మూర్తి అధ్యక్షత వహించగా, ఎమ్మార్వో కృష్ణ ప్రసాద్, ఎంపీడీవో జి శ్రీనివాసరావు, జడ్పిటిసి చెన్నంశెట్టి వరలక్ష్మి, వైస్ ఎంపీపీ ఫణీంద్ర ,సర్పంచ్ నార్లపాటి సమితి ,నాయకులు మందపాటి రాజమోహన్ రెడ్డి ,జిల్లా అధికార ప్రతినిధి యుఎస్ ప్రకాష్ రావు, టౌన్ ప్రెసిడెంట్ సంపూర్ణ, అరటికాయల రవి,కలపాల శ్రీనివాసరావు, చిపనపల్లి శ్రీనివాసరావు, జుజ్జారపు రాంబాబు, గంధం వెంకటేశ్వరరావు, జి ఆనంద్ ,టి హరి, అధికారులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# మైనంపల్లి ఓటమే లక్ష్యం

అల్వాల్ అక్టోబర్ 5 (ప్రజాపాలన, ప్రతినిధి) : మైనంపల్లి హనుమంతరావుకు కాంగ్రెస్ పార్టీ రెండు టికెట్లు కేటాయించడం, బీసీ నాయకుడైన తనను చిన్నచూపు చూడడం మూలంగానే పార్టీని వీడినట్లు నంది కంటి శ్రీధర్ తెలిపారు. ఇటీవల అధికారపార్టీ నుండి కాంగ్రెస్ లో చేరిన వారికి ఇష్టరీతిగా టికెట్లను కేటాయించడం మూలంగానే కన్నతల్లి లాంటి కాంగ్రెస్ ను విడానాడాల్సి వచ్చిందని అన్నారు. కేటీఆర్ సమక్షంలో మల్కాజిగిరి నియోజకవర్గం లోనిఏడు డివిజన్ల కాంగ్రెస్ అధ్యక్షులతో భారాసలో చేరినట్లు అని తెలిపారు. ఆధిష్టానం అవకాశం ఇస్తే మల్కాజిగిరిలో పోటీ చేసేందుకు సిద్ధమని శ్రీధర్ స్పష్టం చేశారు. భారాస పార్టీకి కట్టుబడి ఉంటానని అన్నారు. మైనంపల్లి హనుమంతరావు ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. భారాస మల్కాజ్గిరి టికెట్ ఎవరికి కేటాయించినా సమిష్టిగా పనిచేసి గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.మల్కాజ్గిరి ఎమ్మెల్యేగా మైనంపల్లి హనుమంతరావు తనను తన క్యాడర్ ను అనేకసార్లు ఇబ్బందులకు గురిచేసి అక్రమ కేసులు బనాయించారని అన్నారు. 34 మందికి బీసీలకు టికెట్లు ఇస్తామని కాంగ్రెస్‌చెప్పిన మాటకు కట్టుబడి లేనందుని పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు.

## ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ సేల్.. అమితాబ్ బచ్చన్‌కు రూ.10లక్షలు జరిమానా

న్యూ డిల్లీ అక్టోబర్ 5 పండుగ సీజన్ సందర్భంగా ప్రముఖ ఆన్‌లైన్ రిటైల్ పోర్టల్ ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ సేల్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈనెల 8వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ 'బిగ్ బిలియన్ డేస్' పేరుతో భారీ సేల్ నిర్వహిస్తోంది. ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులపై భారీ డిస్కౌంట్ ఆఫర్ పెట్టింది. అయితే ఈ సేల్‌కు సంబంధించి బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ తో ఓ ప్రకటన చేసింది. ఇందుకు సంబంధించిన ప్రకటనను ఇటీవలే విడుదల చేసింది. అయితే, ఈ ప్రకటనపై ఇప్పుడు వివాదం రాజుకుంది. ఈ వివాదంతో బిగ్‌బీ కూడా చిక్కుల్లో పడ్డారు. ఫ్లిప్‌కార్ట్ ప్రకటనపై ఆల్ ఇండియా ట్రేడర్స్ అసోసియేషన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ ప్రకటన ప్రజలను తప్పుదోవ పట్టించేదిలా ఉందని, చిన్న వర్తకులకు వ్యతిరేకంగా ఉందని సీఏఐటీ ఆరోపించింది. ఈ మేరకు ఫ్లిప్‌కార్ట్‌పై చర్యలు తీసుకోవాలని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల పరిరక్షణ విభాగానికి ఫిర్యాదు చేసింది. అదేవిధంగా ఈ యాడ్‌లో నటించిన అమితాబ్‌పై కూడా చర్యలు తీసుకోవాలని కోరింది. ఆయన చేసిన యాడ్ భారతదేశంలోని రిటైలర్‌లకు బాగా నష్టం వాటిల్లేలా ఉందని పేర్కొంది. ఈ ప్రకటనను వెంటనే తొలగించడమే కాకుండా ఫ్లిప్‌కార్ట్, అమితాబ్‌కు రూ.10లక్షలు చొప్పున జరిమానా విధించాలని డిమాండ్ చేసింది.

## బతుకమ్మ చీరలపై మహిళల ఆగ్రహం

వైరాఅక్టోబర్ 05,(ప్రజాపాలన):బతుకమ్మ చీరలను మహిళలు విసిరేసారు. నాణ్యత లేని చీరలు ఇస్తున్నారని అసహనం వ్యక్తం చేసారు. కేసిఆర్ కుటుంబ సభ్యులు ఇలాంటి చీరలు కట్టుకుంటారా అంటూ నిలదీసారు. వైరానియోజకవర్గం కొణిజర్ల మండలం పెద్ద మునగాల గ్రామ పంచాయితీలో బతకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు బతుకమ్మ చీరలు చూసి అసహనం వ్యక్తం చేసారు. నాణ్యత లేనిచీరెలు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు..బతుకమ్మ చీరలు బొంతలకి , తాళ్ళకి నారుమళు దగ్గర బెదురు పెట్టడానికి వాడుకుంటున్నామన్నారు. నాసిరకం చీరలు మాకు వద్దని అందరు చీరెలనువిసిరేసి కేసిఆర్, మీ కవితమ్మను ఈ చీరెలు కట్టోకోమని చెప్పు, పేద అడపడచులు అంటే ఇంత చిన్న చూపా అంటూ ఆగ్రహం వ్యక్తం చేసారు. 3 సంవత్సరాల నుంచి ఇచ్చిన చీరలు అలానే వున్నాయనిఎవరు కట్టుకోవడం లేదని తీవ్రంగా విమర్శించారు.

## సుద్దేపల్లిలో తుమ్మల పర్యటన



ఖమ్మం :ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలంలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరావు గురువారం పర్యటించారు. సుద్దేపల్లిలో విస్తృతస్థాయి సమావేశానికి అయన హాజరైయారు. గ్రామానికివచ్చిన తుమ్మల నాగేశ్వరావు కు గ్రామస్థులుఘన స్వాగతం పలికారు.

## దళితులకు101యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇవ్వాలి

### వాంకిడి సబ్ ఇంజనీర్ సౌమ్య కు వినతి



ఆసిఫాబాద్ జిల్లా అక్టోబర్ 5 (ప్రజాపాలన,ప్రతినిధి) : జీఓ నెం 342 ప్రకారంగా దళిత కుటుంబాలకు101 యూనిట్లు ఉచిత విద్యుత్తు ఇవ్వాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లాలోని వాంకిడి లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ( కెవిపిఎస్) జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ ఆధ్వర్యంలో నాయకులు సబ్ ఇంజనీర్ సౌమ్య కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దినకర్ మాట్లాడుతూ ధనికులకు, పెట్టుబడిదారులకు, ఉద్యోగులకు, ధనవంతుల వ్యవసాయానికి, ఉచితంగా విద్యుత్ అందిస్తున్నారని, ఇల్లు లేని, భూమిలేని, నిరుపేదలైన దళిత కుటుంబాలకు మాత్రం101 యూనిట్ల విద్యుత్తు అందించడం లేదన్నారు. వెంటనే దళిత కుటుంబాలకు జీవో 342 ప్రకారం అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం కులం సర్టిఫికెట్లు అందజేయలేదని ఆ సాకుతో విద్యుత్ సబ్సిడీ ఇవ్వడం లేదని అన్నారు. ప్రభుత్వం ఆన్లైన్ డేటా ప్రకారం గా దళిత కుటుంబాల లిస్టు ఉన్నదని నిరుపేదలైన ప్రతి దళిత కుటుంబానికి ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు వడ్లూరి వెంకటేష్, లింగయ్య, మల్లయ్య, వెంకటి, పుష్ప, మధునక్క, తదితరులు పాల్గొన్నారు.

## ఆడపడుచులకు పండగ సారె "బతుకమ్మ చీర"



ఆసిఫాబాద్ జిల్లా అక్టోబర్ 5 (ప్రజాపాలన, ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆడపడుచులకు అందిస్తున్న పండగ సారే బతుకమ్మ చీర అని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. గురువారం మండలంలోని సాలెగూడా గ్రామంలో నిర్వహించిన బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధన తర్వాత రాష్ట్రంలో పెద్ద పండగ అయినా బతుకమ్మకు, ఆడపడుచులకు సారే అందించే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చీరల పంపిణీ కార్యక్రమం తీసుకువచ్చారని అన్నారు.అనంతరం గ్రామపంచాయతీ ముందు డ్రైనేజీ కోసం భూమి పూజ చేశారు. జాలర్లకు నిర్మించ తలపెట్టిన కమ్యూనిటీ భవనానికి భూమి పూజ చేశారు. క్రీడాకారులకు క్రీడ సామాగ్రి అందజేశారు.. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, ఎంపీ ఓ ప్రసాద్, సర్పంచ్ వినోద్, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

సంపాదకీయం

శుక్రవారం 06,అక్టోబరు 2023

# 'అక్టోబర్ 5' స్ఫూర్తి ఏదీ?

అక్టోబర్ 5- అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం. మనదేశంలో సెప్టెంబర్ 5కు ఇస్తున్న ప్రాధాన్యతలో కొంత అయినా ఈ రోజుకు కేటాయిస్తే ఒక చర్చ జరిగేది. వ్యక్తి పొగడ్తలతో సాగే తంతు సెప్టెంబర్ 5 అయితే, ఉపాధ్యాయుల స్థాయిని గుర్తించే కార్యక్రమం అక్టోబర్ 5. అందువల్లనేనేమో, మన ప్రభుత్వాలు అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని విస్మరిస్తున్నాయి. 1966లో సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 5 వరకు ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఉపాధ్యాయుల స్థితిగతులను చర్చించి, సమాజంలో వారి పాత్రను గుర్తించి అత్యంత ప్రామాణికమైన 145 సిఫార్సులను ప్రకటించింది. భారతదేశ ప్రతినిధిగా ఆనాటి విద్యా మంత్రిత్వ శాఖ కార్యదర్శి, సలహాదారు అయిన ప్రేమ కృపాల్ హాజరయ్యారు. ఆ సిఫార్సుల నివేదికనే 'స్టేటస్ ఆఫ్ టీచర్స్'గా పిలుస్తున్నారు. విద్యారంగానికి ఉపాధ్యాయ వృత్తికి సంబంధించిన నియామకాలు, ఎంపిక, శిక్షణ మొదలైన విషయాలు శాస్త్రీయంగా జరగాలని సిఫార్సులలో పేర్కొన్నారు. వృత్తి సంబంధమైన ప్రమాణాలు ఖచ్చితంగా ఉండాలని, తద్వారా నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని ఈ సిఫార్సులలో ఉన్నది. ఉపాధ్యాయులకు వృత్తి భద్రత కల్పించాలని, వారు హక్కులతో పాటు బాధ్యతలు గుర్తెరిగేలా ఉండాలని సిఫార్సులలో ఉంది. ఉపాధ్యాయులపై ఏ విధమైన ఒత్తిడి లేకుండా వృత్తిపరమైన స్వేచ్ఛను కల్పించాలని, ఉపాధ్యాయులకు గౌరవప్రదమైన వేతనాలు ఇవ్వాలని, ఆర్థికంగా వారు స్వయం పోషకత్వం కలిగి ఉండాలని సిఫార్సులు చేసింది. వారికి తగినన్ని సెలవులు వుండాలని, వారు తమ విద్యార్హతలను పెంపొందించుకునేందుకు స్టడీ లీవు వంటి సౌకర్యం ఉండాలని సిఫార్సులలో ఉన్నది. ఉపాధ్యాయులకు తగినంత విశ్రాంతి ఉండే విధంగా పనివేళలు నిర్ణయించాలని, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఒత్తిడి లేని పని గంటలు ఉండాలని సిఫార్సు చేసింది. నాణ్యమైన బోధనకు అవసరమైన బోధనోపకరణాలు కల్పించాలని, తరగతి పరిమితి (విద్యార్థి – ఉపాధ్యాయుల నిష్పత్తి) మొదలు అనేక అంశాలు వీటిలో ప్రస్తావించారు. వీటితో పాటుగా పట్టణాలకు సుదూరంగా, గ్రామసీమల్లో పనిచేసే ఉపాధ్యాయుల స్థితిగతులను కూడా చర్చించారు. మహిళా ఉపాధ్యాయుల పరిస్థితులు, వారి ప్రత్యేక అవసరాలు, వైద్య సౌకర్యాలు, వారి భద్రత కోసం చేపట్టవలసిన చర్యలు ఈ సిఫార్సుల్లో ఉన్నాయి. బోధనకు సంబంధించి ఉపాధ్యాయ మార్గదర్శక సూత్రాలు, విద్యావిషయ లక్ష్యాలు, విధానాలు మొదలైనవి కూడా ఈ సిఫార్సుల్లో చోటు చేసుకున్నాయి. ఉపాధ్యాయుడు ఉద్యోగ విరమణ చేసిన తర్వాత పెన్షన్, కుటుంబ పెన్షన్ మొదలైన సిఫార్సులు కూడా పొందుపరిచారు. అయితే అంతటి విలువైన, నాగరికమైన సిఫార్సుల అమలు సక్రమంగా సాగుతున్నదా అన్నదే ప్రశ్న. అమలు సంగతి సరే, వాటి స్ఫూర్తికే విఘాతం కలిగించేలా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. గత మూడు దశాబ్దాల నుంచి విద్యారంగం పట్ల ప్రభుత్వాల దృష్టి మారింది. ప్రపంచీకరణ ప్రభావాలు విద్యారంగంలో స్పష్టంగా చోటు చేసుకున్నాయి. ప్రభుత్వ యాజమాన్యంలో నిర్వహించాల్సిన పాఠశాలలు ప్రైవేటు వ్యక్తులు, సంస్థల అధీనంలోకి వెళ్లిపోతున్నాయి. ఉద్యోగ భద్రతను కోల్పోయి, రోజువారి కూలీ లెక్కన పీరియడ్‌కు ఇంత చొప్పున చెల్లించే పద్ధతిలోకి ఉపాధ్యాయుడు దిగజారిపోయాడు. వీటితో పాటుగా విద్యార్థులను ప్రత్యక్ష బోధన నుంచి దూరం చేశారు. ఉపాధ్యాయుడు%--%విద్యార్థి మధ్య ఉండే సున్నితమైన పవిత్ర భావన చెరిగిపోయింది. నేటి విద్యార్థి దృష్టిలో ఉపాధ్యాయుడికి ఒక ఆండ్రాయిడ్ ఫోన్‌కి పెద్ద తేడా లేదు.రాష్ట్రంలో విద్యారంగ ప్రగతికి ఆటంకం కలిగించే అనేక విషయాలు యధేచ్ఛగా సాగిపోతున్నాయి. దశాబ్దాల క్రితం గ్రామాలలో ఏర్పడిన ప్రాథమిక పాఠశాలల మూసివేత ఈ విధానాలకు పరాకాష్ఠ. వీటితోపాటు నిర్బంధ ఆంగ్లమాధ్యమం అమలు, 117 జీఓ వంటివి పాఠశాలల అభివృద్ధికి విఘాతం కలిగిస్తున్నాయి. వీటితో పాటు ఉపాధ్యాయులను అవకాశం దొరికిన ప్రతిచోట అవమానించడమే పనిగా పెట్టుకుంది ఈ ప్రభుత్వం. కరోనా కాలంలో బ్రాందీ షాపుల వద్ద మందుబాబుల క్యూలను పర్యవేక్షించే పనితో ప్రారంభమై, ఉపాధ్యాయులు మొబైల్ ఫోన్లలో తమ హాజరు వేసుకోవాలి అనే నియమం వరకు పరిస్థితులు కొనసాగుతున్నాయి. అసమ్మతిని, నిరసనను వ్యక్తం చేసే కనీసపు అవకాశం కూడా కల్పించడం లేదు. మునుపెన్నడు లేని విధంగా వేలాదిమంది ఉపాధ్యాయులపై అక్రమ కేసులు బనాయించింది. ఉపాధ్యాయుల మీదే ఎందుకు ఇంతటి కక్ష అంటే, ఉపాధ్యాయులు మాత్రమే ప్రశ్నించే శక్తులు. నియంతృత్వ ధోరణి కలిగిన పాలకులు, సామాజిక చైతన్యం కలిగిన ఉపాధ్యాయులను వేధిస్తారు అనడానికి ఆంధ్రప్రదేశ్ ఒక ఉదాహరణ. ఈ విధానాలన్నీ అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ స్ఫూర్తికి విఘాతం కలిగించేవే. ఈ ఏడాది అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం 2023 సందర్భంగా ఐక్యరాజ్యసమితి The Teachers We Need For The Education We Need: The Global Imperative To Reverse The Teachers Shortage" అనే థీమ్ ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఉపాధ్యాయుల కొరతను అధిగమిస్తూ నేటి సమాజానికి కావలసిన విద్యను అందించడం కోసం అన్ని దేశాలు కృషి చేయాలనే సందేశాన్ని ఈ ఏడాది ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ఆ దిశగా ప్రపంచ దేశాలు అడుగు వేస్తూ విద్యకు ప్రథమ ప్రాధాన్యత కల్పించిననాడు ప్రపంచం అంతటా వెలుగు రేఖలు విస్తరిస్తాయి.

# ఇంకెన్నాళ్లు ఈ కట్టు కథలు పుక్కిటి పురాణాలు

ఇంతన్నాడింతన్నాడే గంగరాజు ముంతమామిడి పండన్నాడే గంగరాజు, హస్కన్నాడు బుస్కన్నడే గంగరాజు, నన్నొగ్గేసేల్పోన్నడే గంగరాజు అన్నట్లు ఉంది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరు. ఈ మధ్య సినిమా నటుల నటన, డైలాగ్ డెలివరీ తలదన్నేట్లు ప్రసంగాలు ఉంటున్నాయి, ప్రజలు న్యూస్ ఛానెల్స్ లో ఎంటర్టైన్మెంట్ చూస్తున్నారు. దేశంలో హరిదాసులు, పిట్టలదొరలు, పగటివేషగాళ్ళు అంతరించిపోయాయని బాధపడే వారు ఇప్పుడు నాయకుల ప్రసంగాలలో వారిని చూసుకుంటున్నారు. ప్రధానమంత్రి నుండి రాష్ట్ర మంత్రులు మాట తీరు పగటివేషగానికి ఎక్కువ పిట్టలదొరకు తక్కువ అన్నట్లు ఉంది. మూడు సంవత్సరాల కిందట కేసీఆర్ మోడీల మధ్య జరిగిన సంభాషణను గుండెల్లో దాచుకొని నిన్ననే తెలంగాణ గడ్డపై ఉద్వేగపూరిత వాతావరణంలో ఛలోక్తులు విసురుతూ ప్రజలకు విడమరచి చెప్పారు. కేసీఆర్ కు మోడీ కళ్ళల్లోకి కళ్ళు పెట్టి చూడలేడని, అవినీతి కేసీఆర్ తన పంచన చేరలేడని తన పార్టీలో అవినీతికి కుటుంబ రాజకీయాలకు తావుండదని తేల్చి చెప్పారు. కార్పొరేటు ఎగవేతదారులు ఎక్కువ మంది బీజేపీ పార్టీకి చెందిన వారు, ఎల్ఐసి, ప్రభుత్వరంగ బ్యాంకులు, సంస్థలకు కుచ్చుటోపీ పెట్టినవారు ఏ పార్టీలో ఉన్నారో. జెడిఎస్ కుమారస్వామి, అప్నాదళ్ అనుప్రియ పటేల్, చిరాగ్ పాశ్వాన్ పార్టీలు ఎన్డిఏ లో ఉన్న సంగతి తెలియదా? కోట్లకు కోట్లు బ్యాంకులను ముంచిన సుజనా చౌదరి, సియం రమేష్, కాంగ్రెస్ లో ఉన్నప్పుడు ఇడి కేసులు ఉన్న జోతిరాధిత్య సింధియా, బిసిసిఐ జయ్ అమిత్భాయ్ షా ఏ పార్టీలో ఉన్నారో తెలియదా ? తెలంగాణ పురపాలక శాఖ మంత్రి మాట్లాడుతూ కూటిలో రాయి తీయనోడు ఏటిలో రాయి తీస్తాడా అని మాట్లాడాడు. అవును మీరు పురపాలక శాఖ మంత్రిగా ఉండి మీరు నివశించే ప్రాంతంలో డ్రైనేజ్ పైపులు పగిలి నిత్యం రోడ్డు మురుగునీటితో తడిసి ముద్దవుతున్నాయి. నాళాలలో గత రెండు నెలల్లో ఏడుగురు చనిపోయారు. వర్షం పడిందంటే వణుకు పుడుతుంది. రాష్ట్ర ప్రజలకు నీళ్లు, నిధులు, నియమకాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ కర్తవ్యం కానీ, కేసీఆర్ హామీ ఇచ్చిన అమలు చేయడం లేదు. సచివాలయం నిర్మాణం, బతుకమ్మ చీరల పంపిణీ, యాదాద్రి అభివృద్ధికి నిధులు వెచ్చించడం దృష్టి కేంద్రీకరించిన కేసీఆర్, రాష్ట్రంలో నిరుద్యోగం, ఉపాధి లేక యువత తీవ్ర నైరాశ్యంలో ఉన్నారు. ప్రభుత్వ బడుల్లో పదహారు వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో పదివేలకు పైగా అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉంది విశ్వవిద్యాలయాల్లో శ్మశాన ప్రశాంతత నెలకొంది. సర్కారు బడులలో సకల వసతులు అని ప్రచార ఆర్భాటాలకు పరిమితమై, తన అనుచరగణం నిర్వహిస్తున్న ప్రయివేటు కళాశాలలకు, విశ్వవిద్యాలయాలకు పెద్ద ఎత్తున సహకారం అందిస్తూ విద్యా వ్యాపారాన్ని పోషిస్తూ బహుజనులకు విద్యను దూరం చేసి సర్వనాశనం చేశారు. సుస్థిర అభివృద్ధి మా డిఎన్ఏ లో ఉందని నగరమంతా డప్పు కొట్టుకుంటున్నారు. దేశములోనే వైద్యవిద్యకు పెద్దపీట వేశామని ఫ్లెక్సీలు కట్టి ప్రచారం చేస్తున్నారు. వైద్య విద్య బోధించడానికి అధ్యాపకులు లేరు, పదిహేను సంవత్సరాల కిందట వెలసిన రిమ్స్ ఆదిలాబాద్ లో పట్టుమని పదిమంది శాశ్విత అధ్యాపకులు లేరు, కొత్తగా వచ్చిన వైద్య కళాశాలల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో చెప్పనక్కర్లేదు. నగరం నడిబొడ్డున ఉన్న నేచురోపతి, ఆయుర్వేదిక్, యునాని, హొమియోపతి కళాశాలల్లో పట్టుమని నలుగురు అధ్యాపకులు లేరు. అక్కడ విద్యార్థులకు అనాటమీ, పెథాలజీ, బయో కెమిస్ట్రీ, ఫార్మకాలజి ప్రొఫెసర్లు లేక గాంధీ ఉస్మానియా కళాశాలల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. వంద సంవత్సరాలు ఘనకీర్తి గడించిన ఉస్మానియా విశ్వవిద్యాలయము, సాంకేతికకు మారుపేరుగా ఉన్న జేఎన్టీయూ హైదరాబాద్, ఉత్తర తెలంగాణలో తలమానికంగా ఉన్న కాకతీయ విశ్వవిద్యాలయం అధోగతి పట్టించిందెవరు? అలాగే కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉన్న సంస్థలు ఎన్జిఆర్ఐ, ఐఐసిటి, జీఎస్ఐ, జినోమ్, సిడిఎఫ్టి, ఫుడ్ టెక్నాలజీ, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్, సెంట్రల్ ఫార్మా ఇన్స్టిట్యూట్, డిఎల్ఆర్ఎల్ నిధులు లేక నీరసించిన సంగతి తెలియదా? . ట్రాఫిక్ నియంత్రణ లేకుండా పోయింది, కాలుష్యం, ప్రమాదకర వ్యర్థాలు, సీజనల్ వ్యాధులు రోగాలు ప్రబలుతున్నా పట్టించుకోరు. భారతదేశంలో పట్టణీకరణ, అనుబంధ రంగాల అసమానతలను పరిష్కరించడానికి బహుముఖ విధానం అవసరం. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా స్థిరమైన పట్టణ ప్రణాళిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు సరసమైన గృహాలపై దృష్టి సారించడం. పరిశ్రమ అవసరాలు శ్రామిక శక్తి సామర్థ్యాల మధ్య అంతరాన్ని తగ్గించడానికి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను పెంపొందించడం, ఉపాధిని నిర్ధారించడం. వలస ఒత్తిళ్లను తగ్గించేందుకు వ్యవసాయ ఉత్పాదకత, గ్రామీణ మౌలిక సదుపాయాలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థల వైవిధ్యాన్ని ప్రోత్సహించే విధానాలను అమలు చేయడంలేదు. సంస్కరణల ద్వారా అనధికారిక రంగం అధికారికీకరణను ప్రోత్సహించడం, కార్మికులకు మెరుగైన వేతనాలు, సామాజిక భద్రత, క్రెడిట్ మరియు శిక్షణ పొందడం, వృత్తి విద్యలపట్ల పునశ్చరణ తరగతులు నిర్వహించడం, నైపుణ్యాలను పెంచడం వంటివి పట్టించుకున్న పాపాన పోలేదు. నగరంలో వెలసిన ఎంఎస్ఎంఇ, జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ, సెంట్రల్ టూల్ డిసైన్, మేనేజ్, ఇన్స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసర్చ్ పనితీరు పూర్తి పేలవంగా ఉంది. ప్రాంతీయ అసమానతలను తగ్గించడానికి వెనుకబడిన ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్య సంరక్షణ పారిశ్రామికీకరణలో పెట్టుబడి పెట్టడం ద్వారా సమతుల్య ప్రాంతీయ అభివృద్ధిని ప్రోత్సహించడం. ఈ సమస్యలను పరిష్కరించడం ద్వారా, భారతదేశం పట్టణీకరణ ప్రయోజనాలను ఉపయోగించుకోవచ్చు, రంగాలలో సమానమైన వృద్ధిని ప్రోత్సహించవచ్చు మరియు మరింత సమగ్రమైన మరియు స్థిరమైన అభివృద్ధి పథాన్ని నిర్ధారిస్తుంది. సమ్మిళిత వృద్ధిని ప్రోత్సహించడానికి తెలంగాణ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నప్పటికీ, సవాళ్లు పరిమితులు ఉన్నాయని గుర్తించడం చాలా అవసరం. వృద్ధిలో చేరికను సాధించడంలో తెలంగాణ ఇబ్బందులు ఎదుర్కుంటోంది. సమ్మిళిత వృద్ధిని ప్రోత్సహించడానికి ప్రయత్నాలు చేసినప్పటికీ, తెలంగాణలో ప్రాంతీయ అసమానతలు కొనసాగుతున్నాయి. అభివృద్ధి మరియు ఆర్థిక అవకాశాలు హైదరాబాద్ వంటి పట్టణ ప్రాంతాల్లో కేంద్రీకరించబడతాయి, అయితే గ్రామీణ మారుమూల ప్రాంతాలు మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్య సంరక్షణ ఉపాధి అవకాశాలను పొందడంలో సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. పట్టణ-గ్రామీణ విభజనను తగ్గించడం అన్ని ప్రాంతాలలో సమతుల్య అభివృద్ధిని నిర్ధారించడం ఒక ముఖ్యమైన సవాలుగా మిగిలిపోయింది. విజ్ఞతగల ప్రజలు రాబోయే రోజులల్లో అవకాశవాద మతోన్మాద పార్టీలకు బుద్ధి చెబుతారని ఆశిద్దాం.

**డా. యం. సురేష్ బాబు**

# విద్య సరుకు కాదు...

'విద్య ఒక సామాజిక వస్తువు. సరుకు కాదు. దీన్ని మార్కెట్లో అమ్మడం లేదా కొనడం చేయకూడదు. ప్రైవేటీకరణ అనేది విద్యాహక్కును కుదిస్తుంది' అంటారు నెల్సన్ మండేలా. 'రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా అణచివేసే సమాజంలో అణగారిన వ్యక్తుల సృజనాత్మకతను వెలికితీసి స్వేచ్ఛను ప్రసాదించే శక్తులను పెంపొందింప చేసేదే విద్య' అని ప్రముఖ విద్యావేత్త పాలో ఫ్రియరీ అభిప్రాయం. 1990లో నూతన ఆర్థిక సంస్కరణల ప్రారంభమైన తర్వాత ప్రభుత్వాలు అన్ని రంగాలతో పాటు విద్యను కూడా తమ పౌరులకు అందించవలసిన సామాజిక బాధ్యత నుండి తప్పుకొని మార్కెట్ శక్తుల చేతిలోకి పూర్తిగా అప్పగించే దిశగా ప్రయాణం ప్రారంభించి ఇప్పటికే మూడు దశాబ్దాలు దాటింది. భారతదేశంలో 1978లో ప్రయివేటు విద్యాసంస్థలలో 3.4 శాతంగా ఉన్న విద్యార్థులు 1993 నాటికి 9.2 శాతంగా పెరిగారు. 2021-22 యుడిఐఎస్ఇ ప్రకారం 2022 నాటికి ప్రయివేటు విద్యాసంస్థల్లో విద్యార్థులు 33 శాతానికి పెరిగారు. ప్రయివేటు పాఠశాలల సంఖ్య 2.3 శాతం నుండి నేడు 23 శాతానికి చేరాయి. ఈ గణాంకాలు గత మూడు దశాబ్దాల కాలంలో దేశంలో పాఠశాల విద్యలో 90 తర్వాత పెరిగిన ప్రైవేటీకరణ వేగాన్ని తెలియజేస్తున్నది. దాదాపు 8 కోట్ల 83 లక్షల మంది విద్యార్థులు ఈ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. 3 లక్షల 41 వేల మంది ఉపాధ్యాయులు ఈ సంస్థల్లో పనిచేస్తున్నారు. వీరు మొత్తం ఉపాధ్యాయుల్లో 38 శాతంగా ఉన్నారు. యునెస్కో వారి జిఇఎమ్ (గ్లోబల్ ఎడ్యుకేషన్ మోనిటరింగ్ రిపోర్ట్)-2022 నివేదిక ప్రకారం 2014 నుండి స్థాపించిన 97 వేల పాఠశాలల్లో 67 వేల ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. యునెస్కో గణాంకాల ప్రకారం 187 దేశాల్లో పాఠశాల విద్యను ప్రైవేటుపరం చేసిన దేశాల్లో భారత్ 15వ స్థానంలో ఉంది అంటే ఇక్కడ పాఠశాల విద్య ఎంత వేగంగా మార్కెట్ పరం అవుతుందో అర్థం చేసుకోవచ్చు. మన పొరుగునే ఉన్న శ్రీలంకలో సైతం ప్రాథమిక స్థాయిలో 3.2 శాతం మంది విద్యార్థులు మాత్రమే ప్రయివేటు పాఠశాలల్లో చదువు తున్నారని యునెస్కో గణాంకాలు తెలియజేస్తున్నాయి. భారతీయ సమాజంలో పిల్లలను చదివించుకోవాలనే ఆకాంక్ష పెరగడం ఒక సానుకూల అంశం. గతంలో లాగా పిల్లలకు నాలుగు అక్షరం ముక్కలు వస్తే చాలనుకునే దశ నుండి పిల్లలకు నాణ్యమైన విద్యనందించాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. ఈ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలను స్థాపించి నాణ్యమైన విద్యను అందించడంలో ప్రభుత్వం విఫలం కావడం విద్యార్థులు ప్రైవేటు బాట పట్టడానికి ఒక ప్రధాన కారణం. యునెస్కో జిఇఎమ్-2022 ప్రకారం ప్రైవేటుకు వెళుతున్న విద్యార్థులలో 73 శాతం తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందటం లేదని, ఇంగ్లీష్ మీడియం విద్య కోసం 12 శాతం మంది, 10.2 శాతం ప్రభుత్వ స్కూలు అందుబాటులో లేకపోవడం వలన, 4.7 శాతం ఇతర కారణాలు ప్రైవేటు బాట పడుతున్నారని తెలియజేస్తున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి ఏడు పాఠశాలలకు ఒక పాఠశాలలో ఐదు తరగతుల వరకు ఒకే ఒక ఉపాధ్యాయుడు బోధిస్తున్నారు. కానీ ప్రైవేటు పాఠశాలల్లో 81.4 శాతం పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉంటున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు ఉండకూడదని అనేక నివేదికలు, ఎన్ఇపి (నూతన విద్యా విధానం) వంటివి సూచించాయి. అయినప్పటికీ ప్రభుత్వాలు ఉపాధ్యాయులపై బోధనేతర పనులు మోపడంతో బోధనా సమయం హరించుకుపోతున్నది. ఇది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నాణ్యతను తీవ్రంగా దెబ్బతిస్తున్నది. అందువలన ప్రభుత్వ పాఠశాలలు సామాన్య ప్రజల నమ్మకాన్ని కోల్పోయాయి. ఐదు తరగతులకు ఒకే ఒక ఉపాధ్యాయునిచే బోధించడం అంటే విద్యా హక్కును నిరాకరించడమే అవుతుంది. కేంద్ర విద్యాశాఖ గణాంకాల ప్రకారం ఇప్పటికే దేశవ్యాప్తంగా 1:30 నిష్పత్తిలో పది లక్షల ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇవి మొత్తం ఉపాధ్యాయులలో 15.7 శాతం. దీనినిబట్టే ప్రభుత్వ విద్యపై ప్రభుత్వాల ప్రేమ అర్థమవుతుంది.




విద్య ప్రాథమిక లక్ష్యాలు పట్టవా? విద్య ద్వారా సాంఘిక జాతీయ సమైక్యతను సాధించడం, ప్రజాస్వామిక విలువలు అభివృద్ధి పరచడం, సాంఘిక నైతిక విలువలను అభివృద్ధి పరచడం, అంతర్జాతీయ అవగాహన పెంపొందించడం వంటి లక్ష్యాలను కొఠారి కమిషన్ సూచించింది. జాతీయ విద్యా విధానం(ఎన్ఇపి)-1986 కూడా ప్రాథమిక స్థాయిలో మాతృభాషలో బోధన, క్రీడలకు వ్యాయామానికి సముచిత స్థానం, లౌకికత మానవతా విలువలు పెంపొందించడం, విద్యలో సమాన అవకాశాలు కల్పించడం వంటి లక్ష్యాలను నిర్దేశించింది. నూతన విద్యా విధానం కూడా దాదాపుగా ఇదే లక్ష్యాలను సూచించింది. దాదాపుగా దేశంలో సగం మంది పిల్లలు చదువుతున్న ప్రైవేటు విద్యాసంస్థల నిర్వహణ, బోధనా విధానాలపై పర్యవేక్షణ లేకుండా భవిష్యత్తు భారతాన్ని నిర్మించలేం. ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలు ఆశించిన మేర లేవనేది అసర్ నివేదిక, యునెస్కో వారి జిఇఎమ్ రిపోర్టుల ద్వారా స్పష్టం అవుతుంది. రెండవ తరగతి స్థాయి పాఠ్య పుస్తకాన్ని చదవగలిగిన 3వ తరగతి విద్యార్థులు 20.5 శాతం, ఐదో తరగతి విద్యార్థులు 42.8 శాతం మంది ఎనిమిదో తరగతి విద్యార్థులు 69.2 శాతం మంది మాత్రమే ఉన్నారు అంటే ఈ విద్యాసంస్థల్లో నాణ్యతను అర్థం చేసుకోవచ్చు. విద్య ప్రైవేటీకరణతో విద్యారంగంలో నూతన సవాళ్ళను ఎదుర్కోవాల్సి వస్తున్నది. ప్రైవేటీకరణ విధానాలు పాఠశాలల్లో పెట్టుబడి పెట్టి నిర్వహించడం వరకే పరిమితం కావడంలేదు. విద్య ప్రాథమిక లక్ష్యాన్ని మరిచిపోయేలా నూతన లక్ష్యాలను, నిర్వహణ విధానాలను ప్రవేశపెడుతున్నాయి. ఇవి మార్కెట్ విలువలను పెంచే విధంగా విద్యను మార్చి విద్యలో మాధుర్యాన్ని కోల్పోయేలా చేస్తున్నాయి. విద్యాసంస్థల మధ్య లాభాల పోటీలో భాగంగా పాఠశాలల పని వేళలను పెంచటం, పాఠశాల స్థాయిలోనే జెఇఇ, నీట్, ఐఎఎస్ వంటి పోటీ పరీక్షలకు సంసిద్ధులను చేయడమనే పేరుతో విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి పెంచుతున్నాయి. విద్యా స్వభావాన్ని మాత్రమే కాకుండా కీలకమైన సామాజిక సాంస్కృతిక సంబంధాలను కూడా రూపాంతరం చెందిస్తున్నాయి. 3.75 లక్షల కోట్ల డాలర్ల డిజిపితో ప్రపంచంలోనే ఐదవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారతదేశం 2025 నాటికి ప్రపంచంలో ఐదు ట్రిలియన్ల డాలర్లతో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించబోతోందని ప్రధాని నరేంద్ర మోడీ ఘనంగా చెప్పుకోవడం చూస్తున్నాం. ఇటువంటి దేశంలో భావి భారత పౌరుల విద్య కోసం మూడు శాతం లోపు మాత్రమే ఖర్చు పెడుతూ...విద్యను అందించవలసిన బాధ్యత నుండి తప్పుకొని కార్పొరేట్ల చేతుల్లో పెట్టడం దేశభక్తి అవుతుందా? విద్యార్థులకు అసమాన అవకాశాలను కల్పించే ఈ విద్యా వ్యవస్థను మార్చి కొఠారి కమిషన్ సూచించిన విధంగా కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలి. కత్తులు దూసే విద్యా వ్యాపారంలో బలవుతున్న బాలల జీవితానికి రక్షణ కల్పించాలి. విద్యార్థులకు విరామ సమయం, ఆటలాడుకునే హక్కు, తగిన సౌకర్యాలు విద్యా సంస్థలు కల్పించాలి.

# కరీంనగర్ కాంగ్రెస్ లో గందరగోళం

కరీంనగర్, అక్టోబరు 5:తెలంగాణా రాష్ట్రంలోనే కాంగ్రెస్ పార్టీకి కంచు కోటగా ఉన్న కరీంనగర్ నియోజకవర్గంలో నాయకుల తీరుతో కార్యకర్తలు దిక్కుతోచని స్థితికి చేరుతున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పలువురి పేర్లు వినబడుతున్న నేపథ్యంలో ఎవరి వద్దకు వెళ్తే ఇంకొకరు ఎలా రియాక్ట్ అవుతాకొ తెలియక తికమక పడుతున్నారు కాంగ్రెస్ పార్టీలో కరీంనగర్ జిల్లా నుండి ఢిల్లీ వరకు ఎంతో మంది నాయకులు ఎన్నో పదవులు అలంకరించారు.ప్రధాన మంత్రిగా దేశానికి సేవలు అందించిన పీవీ నరసింహరావు, ఎమ్మెస్సార్, శ్రీపాద రావు,గుడిసెల వెంకటస్వామి, రత్నాకర్ రావు, చొక్కారావు ఇలా చెప్పుకుంటు పోతే కాంగ్రెస్ పార్టీలో కరీంనగర్ నుండి చక్రం తిప్పిన వారు చాలామంది ఉన్నారు. అలాంటి కరీంనగర్ నియోజకవర్గం ప్రస్తుత పరిస్థితి గాడి తప్పిందని కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు.కరీంనగర్ జిల్లా కేంద్రంగా గతంలో ఢిల్లీ వరకు చక్రం తిప్పిన నాయకుల్లో కీలక పాత్ర పోషించిన జీవన్ రెడ్డి జగిత్యాలకు పరిమితం కావడం,దుద్దిళ్ల శ్రీధర్ బాబు కరీంనగర్ జిల్లా రాజకీయాలకు అంటిముట్టనట్టుగా వ్యవహరించడం,కరీంనగర్ నియోజకవర్గం నుండి రెండు సార్లు ఎంపీగా పోటీచేసిన పొన్నం ప్రభాకర్ ప్రస్తుతం ఎమ్మెల్యే అభ్యర్థిగా హుస్నాబాద్ నుండి పోటీచేస్తుండడంతో సీనియర్ నాయకులలో పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో ఎమ్మెల్యే సీటును ఆశిస్తున్న వారిలో ఐక్యత లోపించి ఎవరి ప్రచారాలకు వారు పరిమితమయ్యారు.?కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా గంగుల కమలాకర్, బీజేపీ అభ్యర్థిగా బండిసంజయ్ పేర్లు ఖరారు కాగా , కాంగ్రెస్ పార్టీలో మాత్రం నలుగురైదురు ఆశావహులు ఎవరికి వారు తామే అభ్యర్థులుగా ప్రచారాలు చేసుకుంటున్నారు.దుద్దిళ్ల శ్రీధర్ బాబు శిష్యుడిగా పేరుగాంచిన కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఇటీవలే బీజేపీ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన మైత్రి గ్రూప్స్ ఛైర్మెన్ కొత్త జయపాల్ రెడ్డి, బొమ్మకల్ సర్పంచ్ పురమల్ల శ్రీనివాస్, ఎమ్మెస్సార్ మనవడు మెన్నేని రోహిత్ రావు, చొక్కారావు మనవడు నిఖిల్ చక్రవర్తి , పీసీసీ సెక్రటరీ అంజన్ కుమార్, సిఎం కేసీఆర్ అన్న కూతురు రేగులపాటి రమ్యారావుతో పాటు పలువురు ఎమ్మెల్యే అభ్యర్థులుగా ప్రచారాలు చేసుకుంటున్నారు.ఎవరి స్థాయిలో వారు టిక్కెట్ కోసం ప్రయత్నాలు చేసుకుంటూ ప్రచారంలో దూసుకు పోతున్నా అభ్యర్థి ఎవ్వరనేది తేల్చుకోలేక కిందిస్థాయి కార్యకర్తలు తంటాలు పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎవరో ఒకరిని త్వరగా ప్రకటించి సీనియర్ నాయకులు దృష్టి సారిస్తే పార్టీకి పూర్వ వైభవం వస్తుందని స్థానిక నాయకులు చెబుతున్నారు.

# ఓబీసీల చుట్టూ రాజకీయం

రాజకీయాల్లో కులాలు, మతాలు ఆధారంగా ఓటుబ్యాంకు రాజకీయాలు చేయడం కొత్తేమీ కాదు. ఈ క్రమంలో దళితులను, గిరిజనులను, ముస్లిం మైనారిటీ వర్గాలను ఓటుబ్యాంకుగా మార్చుకుని కాంగ్రెస్ సహా అనేక పార్టీలు గెలుపొందుతూ వచ్చాయి. అల్పసంఖ్యాకంగా ఉన్న బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య సామాజికవర్గాలు సైతం కొన్ని పార్టీలకు ఓటుబ్యాంకుగా పనికొచ్చాయి. కానీ దేశ జనాభాలో జనాభాలో 50% కంటే ఎక్కువగా ఉన్న ఇతర వెనుకబడిన వర్గాలు (ఓబీసీ)ను మాత్రం ఓటుబ్యాంకుగా మార్చుకోవడంలో ఏ పార్టీ సఫలం కాలేదు. వృత్తుల ఆధారంగా అనేక కులాల సమాహారంగా ఉండడం, రాజకీయ చైతన్యం విషయంలో కులాల మధ్య వ్యత్యాసాలు ఉండడం వంటి కారణాలతో గంపగుత్తగా అందరినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావడం సాధ్యపడలేదు. చివరకు ఓబీసీ ? మండల్ ఉద్యమాలతో రాజకీయాలు చేసిన సమాజ్‌వాదీ, రాష్ట్రీయ జనతా దళ్ వంటి పార్టీలు సైతం ఓబీసీ వర్గాలన్నింటినీ ఆకట్టుకోలేకపోయాయి. ఓబీసీల్లో సంఖ్యాబలం ఎక్కువగా ఉన్న యాదవ, కుర్బ వంటి సామాజికవర్గాలే ఈ పార్టీలకు వెన్నుదన్నుగా నిలిచాయి.ఆ ఓటు బ్యాంకుపై ఇప్పుడు అన్ని రాజకీయ పార్టీలు దృష్టి పెట్టాయి. ఇన్నాళ్లుగా విస్మరించిన వెనుకబడిన వర్గాలే ఇప్పుడు అధికారాన్ని సాధించడంలో కీలకంగా మారాయి. 80వ దశకంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీకి వెన్నెముకలా నిలిచిన బీసీ ఓటర్లు.. దేశవ్యాప్తంగా 90వ దశకం నుంచి నిర్ణయాత్మక శక్తిగా ఎదిగారు. మండల్ కమిషన్ సిఫార్సుల లాలూ ప్రసాద్ యాదవ్, నితీష్ కుమార్ వంటి బీసీ నేతలు దేశ రాజకీయాల్లో ఎదిగారు. ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో కులం ఆధారిత రాజకీయ పార్టీలు సమాజ్‌వాదీ, ఆర్జేడీ, బీఎస్పీ, జేడీ(యూ) బలోపేతమయ్యాయి 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సొంతంగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగల్గినంత మెజారిటీ సాధించడం వెనుక కూడా ఓబీసీ ఓటుబ్యాంకే కీలకంగా మారింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఓబీసీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తం కావడంతో ఆ ఓటుబ్యాంకు ఆయన వెంట నడిచొచ్చింది. మరోసారి గెలిచేందుకు కూడా ఓబీసీ ఓటుబ్యాంకుపైనే ఆ పార్టీ ఆశలు పెట్టుకుంది. గత మూడు, నాలుగు దశాబ్దాల్లో ఓబీసీ ఓటుబ్యాంకుకు మెల్లమెల్లగా దూరమవుతూ వచ్చిన కాంగ్రెస్ కూడా ఇప్పుడు ఆ వర్గాన్ని దరిచేసుకునే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. వివిధ రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల సంగతి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మొత్తంగా దేశవ్యాప్తంగా అన్ని పార్టీలు ఓబీసీ ఓటుబ్యాంకు పైనే కన్నేశాయి.దశాబ్దకాలంగా దేశ రాజకీయాల్లో ఓబీసీల రాజకీయ ప్రాబల్యం పెరిగింది. తదనుగుణంగా ప్రాధాన్యత, ప్రాతినిధ్యం కూడా పెరుగుతోంది. 2014లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ, బీజేపీ ప్రధాని అభ్యర్థిగా అడుగుపెట్టినప్పటి నుంచి పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. దేశంలో ముఖ్యంగా హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో ఓబీసీ సామాజికవర్గంలో ఆయనకు విశేష ఆదరణ కనిపించింది. తనను అధికారంలోకి తెచ్చిన ఓబీసీలకు ప్రయోజనం కల్పించడం కోసం ప్రధాని మోదీ నేషనల్ కమిషన్ ఫర్ బ్యాక్‌వార్డ్ క్లాసెస్ (ఎన్సీబీసీ)కి రాజ్యాంగబద్ధత కల్పించారు. పూచీకత్తు అవసరం లేని ముద్ర రుణాల పథకాన్ని ఓబీసీలను దృష్టిలో పెట్టుకుని ప్రవేశపెట్టారు. 2019లో మరోసారి అధికారంలోకి వచ్చాక కేంద్ర మంత్రివర్గంలో చరిత్రలో ఎప్పుడూలేనంత పెద్ద సంఖ్యలో 26 మంది ఓబీసీ నేతలకు చోటు కల్పించారు. చేతి వృత్తులపై ఆధారపడే ఓబీసీ వర్గాలకు చేయూతనిచ్చేందుకు పీఎం-విశ్వకర్మ పథకాన్ని తీసుకొచ్చారు. 'విశ్వకర్మ యోజన' ద్వారా వడ్రంగులు, కుమ్మరులు, స్వర్ణకారులు, కమ్మరి వంటి చేతివృత్తుల కులాలు, కళాకారులు ప్రయోజనాలు అందుకోనున్నారు. ఈ వర్గాలు రాజకీయాల్లో అత్యంత నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురైఉన్నారు.ప్రభుత్వపరంగానే కాదు, పార్టీలోనూ ఓబీసీలకు ప్రాధాన్యత పెంచుతూ వచ్చారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయాధ్యక్షుడిగా డా. కే. లక్ష్మణ్ వంటి విద్యాధికుడికి బాధ్యతలు అప్పగించారు. ఆయనకు బీజేపీలోనే అత్యున్నత నిర్ణయాత్మక విభాగమైన పార్లమెంటరీ బోర్డులో సభ్యుడిగా, పార్టీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీలో సభ్యుడిగా నియమించారు. సాధారణంగా రాజకీయ పార్టీలు తమకు భారీగా భూరి విరాళాలు ఇచ్చే పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, బడాబాబులకు రాజ్యసభ సభ్యత్వాన్ని ఇస్తుంటాయి. బీజేపీ గత పదేళ్లలో సామాజిక సమీకరణాలకు పెద్దపీట వేస్తూ లక్ష్మణ్ వంటి నేతలను రాజ్యసభకు పంపించింది. 'సబ్ కా సాత్ ? సబ్ కా వికాస్ ? సబ్ కా విశ్వాస్' నినాదంతో అన్నివర్గాలను కలుపుకుపోతూ ఓబీసీలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ వచ్చింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ ఓబీసీల ఆదరణతో మరోసారి గెలుపొందాలని భావిస్తోంది. కొన్ని అంచనాల ప్రకారం 2009లో కాంగ్రెస్ పార్టీకి 24 శాతం ఓబీసీ ఓట్లు రాగా ఆ ఏడాది బీజేపీకి 22 శాతం ఓబీసీ ఓట్లు వచ్చాయి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో 34 శాతం ఓబీసీ ఓట్లు బీజేపీకి రాగా, కాంగ్రెస్‌కు 15 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇక 2019లో బీజేపీకి ఓబీసీ ఓట్ల శాతం మరింత పెరిగి 44 శాతానికి చేరుకోగా, ఓబీసీ ఓట్లలో కాంగ్రెస్‌కు కేవలం 15 శాతం మాత్రమే వచ్చాయి.80వ దశకం వరకు ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడానికి అవసరమైన సంఖ్యాబలాన్ని సొంతంగానే గెలుచుకుంటూ వచ్చిన కాంగ్రెస్ పార్టీ, 90వ దశకం నుంచి పతనం వైపు అడుగులు వేసింది. మండల్ ఉద్యమం, ఓబీసీల్లో పెరిగిన రాజకీయ చైతన్యం కారణంగా ఆ వర్గాలు కాంగ్రెస్‌కు దూరమై, ప్రాంతీయపార్టీల పరం అయ్యాయి. ఈ లోటును ఆ పార్టీ ఇదివరకు గుర్తించిందో లేదో కానీ ఇప్పుడు రాహుల్ గాంధీ ఓబీసీ రాగం అందుకున్నారు. ఓబీసీ జనాభా శాతంపై కచ్చితమైన లెక్కలు లేనప్పటికీ అనేక పెద్ద రాష్ట్రాల్లో 50% మించి జనాభా ఓబీసీలదే అన్న విషయంలో ఎవరికీ సందేహం లేదు. అంత పెద్ద ఓటుబ్యాంకును విస్మరించినా, నిర్లక్ష్యం చేసినా గెలుపు అందుకోవడం సాధ్యం కాదని ఆయన గ్రహించినట్టు కనిపిస్తోంది. 50 శాతం మించిన ఓబీసీలను, 50 శాతం వరకు ఉన్న మహిళలను ఆకట్టుకునే ప్రయత్నాల్లో బీజేపీ పావులు కదుపుతున్న వేళ, ఆయన తాజాగా పార్లమెంటులో పాస్ చేసిన మహిళా రిజర్వేషన్ల బిల్లులో ఓబీసీ మహిళలకు చోటు లేదన్న విషయాన్ని ఎత్తి చూపుతున్నారు. అలాగే తాము అధికారంలోకి రాగానే జనగణనలో కులగణన చేపడతామంటూ హామీలు గుప్పిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని కాంగ్రెస్ నిర్వహించిన 'జన్ ఆక్రోశ్' యాత్రలో ప్రసంగిస్తూ ఓబీసీలకు రాజ్యాధికారం ఇవ్వడంలో బీజేపీ విఫలమైందని ఆరోపించారు. ఓబీసీల సంక్షేమం కోసం బీజేపీ సర్కారు చేసిందేమీ లేదని విమర్శించారు.త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుపుకోనున్న తెలంగాణలోనూ ఓబీసీ ఓట్లే పార్టీల రాజకీయ భవితవ్యాన్ని తేల్చనున్నాయి. ఓబీసీలు గంపగుత్తగా ఒకవైపు నిల్చుంటే కచ్చితంగా మిగతా వర్గాల ఓటుబ్యాంకు మొత్తం ఒకవైపుకు తీసుకొచ్చినా సరే ఎదుర్కోవడం సాధ్యపడదు. ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించిన తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల్లో ఓబీసీలకు రాజకీయాల్లో ప్రాతినిధ్యం, ప్రాధాన్యత పెరిగాయి. ఫలితంగా ఓబీసీలు తెలుగుదేశం పార్టీకి వెన్నెముకలా నిలిచారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఆ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ బలహీనపడ్డ తర్వాత క్రమంగా ఆ ఓటుబ్యాంకు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)తో పాటు ఇతర పార్టీలకు తరలి వెళ్లింది. అయితే కాంగ్రెస్ మాత్రం ఓబీసీల నుంచి పెద్దగా ఆదరణ పొందలేకపోయింది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత తెలంగాణ ప్రాంతంలో కాంగ్రెస్ సగం కంటే ఎక్కువ సీట్లు ఎప్పుడూ గెలుచుకోలేకపోయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సమయంలో సైతం తెలంగాణ ప్రాంతంలో కాంగ్రెస్ సగం సీట్ల కంటే తక్కువకే పరిమితమైంది. ఇందుక్కారణం ఈ ప్రాంతంలోని ఓబీసీ ఓటర్లు కాంగ్రెస్‌కు దూరం కావడమే.


# ఉత్కంఠ రేపుతున్న రామగుండం..




కరీంనగర్, అక్టోబరు 5, : కార్మిక క్షేత్రంగా పేరుగాంచిన రామగుండం నియోజకవర్గంలో రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో భారతీయ జనతా పార్టీకి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మరో షాక్ తగిలింది. రామగుండం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ బీజేపీ పార్టీకి రాజీనామా చేసారు. ఈ సారి ఏ పార్టీకి సంబంధం లేకుండా ఇండిపెండెంట్ గా పోటీచేయడమే శ్రేయస్కరమని భావిస్తూ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు లేఖలో పేర్కొన్నారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీలో ఇంజనీర్ గా పనిచేసిన సోమారపు సత్యనారాయణ 1998లో కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లో అడుగుపెట్టి రామగుండం మున్సిపాలిటీ తొలి ఛైర్మెన్ గా ఎన్నికయ్యారు.2004 వరకు ఛైర్మెన్ గా కొనసాగిన సత్యనారాయణ ఆ తర్వాత తెలుగుదేశం పార్టీలో చేరి మంథని నుండి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీచేసారు.ఆ తదుపరి 2009 లో రామగుండం నియోజకవర్గంలో ఇండిపెండెంట్ గా పోటీచేసి ఘన విజయం సాధించి తిరిగి కాంగ్రెస్ పార్టీ లో చేరారు.తెలంగాణా రాష్ట్ర సాధనకోసం కేసీఆర్ చేసిన పోరాటానికి ఆకర్షితుడై టీఆర్ఎస్ పార్టీలో చేరిన సోమారపు 2014లో టీఆర్ఎస్ అభ్యర్థిగా ఘన విజయం సాధించారు.సోమారపు పనితీరు మెచ్చిన కేసీఆర్ 2016లో ఆర్టీసీ ఛైర్మెన్ గా నియమించారు.2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి టీఆర్ఎస్ నుంచి పోటీచేసిన సత్యనారాయణకు స్వంత పార్టీ నేతలు సహకరించకపోవడంతో ఓటమి పాలయ్యారు. సోమారపు సత్యనారాయణ ప్రియశిష్యుడిగా పారిశ్రామిక ప్రాంతంలో పేరుగాంచిన కోరుకంటి చందర్, 2018లో జరిగిన ఎన్నికల్లో చివరి క్షణంలో సోమారపు సత్యనారాయణపై రెబెల్ అభ్యర్థిగా పోటీలో నిలిచారు.స్వంత పార్టీ నేతలే రెబెల్ అభ్యర్థి కోరుకంటికి ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించి.. సోమారపును ఎన్నికల్లో ఓడించారని భావించి టీఆర్ఎస్ పార్టీని వీడి బీజేపీ పార్టీలో చేరారు.కాంగ్రెస్ పార్టీ నుండి ఠాకూర్ మక్కాన్ సింగ్, బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీజేపీ పార్టీ నుండి సోమారపు సత్యనారాయణలు అసెంబ్లీ అభ్యర్థులుగా ఖరారయ్యారనే ప్రచారం నేపథ్యంలో బీజేపీ పార్టీకి రాజీనామా చేయడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది.గతంలో పలుపార్టీల్లో పనిచేసిన అనుభవంతో పాటు అన్ని పార్టీలతో సత్సంబంధాల నేపథ్యంలో ఏదొక పార్టీ అభ్యర్థిగా ఉంటే ఇతర పార్టీలవాళ్ల మద్దతు తక్కువగా ఉంటుందని సోమారపు భావిస్తున్నారు. రెబెల్ అభ్యర్థిగా రంగంలోకి దిగితే కోరుకంటి చందర్ పై ఉన్న వ్యతిరేఖత తనకు అనుకూలం అవుతుందని,కార్మిక సంఘాల నాయకుల మద్దతు కూడా తనకే దక్కుతుందని భావిస్తున్నారు.ఈ ఆలోచనతో సోమారపు సత్యనారాయణ ఇండిపెండెంట్ గా పోటీలోకి దిగడం ఖాయమని తెలుస్తోంది. బీఆర్ఎస్ అభ్యర్థి అయిన కోరుకంటి చందర్ పై జరిపిన సర్వేల్లో సోమారపు ముందంజలో ఉన్నట్టు భావించిన ముఖ్యమంత్రి కేసీఆర్ తిరిగి బీఆర్ఎస్ పార్టీలోకి రావాలని స్వయంగా ఆహ్వానించినా ,సున్నితంగా తిరస్కరించినట్టు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.గత ఎన్నికల్లో చందర్ కు కేటీఆర్ మద్దతునివ్వడం వల్లే తాను ఓటమి పాలయ్యాయని, బీఆర్ఎస్ నుంచి తాను పోటీచేయడానికి అవకాశమిచ్చినా చందర్ మరో సారి ఇండిపెండెంట్ గా నిలుస్తాడని,కేటీఆర్ మరోసారి తనకు మద్దతు ఇవ్వడనే గ్యారంటీ ఏముందని సన్నిహితుల దగ్గర వాపోయినట్టు ప్రచారం జరుగుతోంది. ఏదైనా రామగుండం నియోజకవర్గంలో రాజకీయాలు రోజుకో కొత్త మలుపు తిరుగుతూ ఉత్కంఠ ను రేపుతున్నాయి.

# అట్టహాసంగా ఆదూరి గ్రూప్ మెగా ప్రాజెక్ట్స్ బ్రోచర్ ఆవిష్కరణ...

**ఒకేసారి మూడు అద్భుతమైన మెగా ప్రాజెక్ట్ లకు శ్రీకారం చుట్టిన ఆదూరి గ్రూప్..**
**పాల్గొన్న సినీ నటి జాతిరత్నాలు ఫేమ్ ఫారియా అబ్దుల్లా...**



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి):ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ ఆదూరి గ్రూప్ మూడు మెగా ప్రాజెక్ట్ లను ప్రారంభించి రియల్ రంగంలో నూతన శకానికి శ్రీకారం చుట్టింది. గురువారం మాదాపూర్ లోని శిల్ప కళా వేదికలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సినీ నటి జాతిరత్నాలు ఫేమ్ ఫారియా అబ్దుల్లా ముఖ్య అతిధిగా పాల్గొనగా ఆదూరి చైర్మన్ రామాంజనేయులు మెగా ప్రాజెక్ట్స్ బ్రోచర్ ఆవిష్కరించారు. ఆదూరి గ్రూప్ నూతనంగా ప్రారంభిస్తున్న ఐకానిక్ -4, డ్రీం వ్యాలీ -2, గోల్డెన్ హైట్స్ వంటి అద్భుతమైన ప్రాజెక్ట్ ల గురించి ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకి అందుబాటులో ఉండే ధరలో నివాస స్థలం కల్పించాలన్న లక్ష్యంతో హెచ్ ఎం డి ఎ, డి టి సి పి, మెగా గేటెడ్ ఫార్మ్ ల్యాండ్ వెంచర్లను ప్రారంభించామని,గతంలో తాము చేపట్టిన ప్రాజెక్ట్ లన్నీ విజయవంతం అయ్యాయని,తమ సంస్థ విజయానికి కారణం




కస్టమర్లకు తమపై ఉన్న అపారమైన నమ్మకం, నిబద్ధత కల్గిన మార్కెటింగ్ సిబ్బంది, కంపెనీ లోని అన్ని డిపార్ట్ మెంట్ ల ఉద్యోగులు ఒక కుటుంబం లాగా పనిచేస్తే విజయాలు ఎలా సాధించగలమో మా కంపెనీ ఒక గొప్ప ఉదాహరణ అన్నారు.ఈ మూడు ప్రాజెక్టు బెంగుళూరు




హైవేలో షాద్ నగర్ సమీపంలో ఉన్నాయని,చెప్పింది చెప్పినట్లు చేయటంలో మాకు మేమే సాటి అన్నారు.అతి త్వరలో మరో ఐదు ప్రాజెక్ట్ లను ప్రారంభించనున్నట్లు అందులో 200 ఎకరాలలో రిటైర్ మెంట్ హోమ్స్ అనే ప్రాజెక్ట్ కూడా ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సినీ నటి ఫారియా అబ్దుల్లా సంస్థ డైరెక్టర్లందరిని షీల్డ్ లతో సత్కరించారు.సినీ నటి ఫారియా అబ్దుల్లా మాట్లాడుతూ ఆదూరి గ్రూప్ మెగా ప్రాజెక్ట్ లను ప్రారంభించడం ఆనందంగా ఉందని, ఈ బ్రోచర్ లాంచ్ కార్యక్రమంలో తనను ఆహ్వానించినందుకు సంస్థ చైర్మన్ రామాంజనేయులు,మేనేజింగ్ డైరెక్టర్ కామాక్షి లకు ధన్యవాదాలు తెలిపారు.సంస్థ విజయం లో పాలుపంచుకున్న అందరు సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ కామాక్షి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మధుసూధన్ రెడ్డి, సీనియర్ మార్కెటింగ్ డైరెక్టర్లు వీర భద్ర, బాలరాజ్, ఆర్యన్, బి ఎన్ వి కృష్ణ, దొరస్వామి. లాలూ నాయక్, అనిల్ కుమార్, లక్ష్మణ్. కమల్, పండరీనాథ్, మహేష్, డైరెక్టర్లు,సినీ నటుడు కేవీ ప్రదీప్, మోటివేషనల్ స్పీకర్ శ్రీపాదరం,సంస్థ ఉద్యోగులు, మార్కెటింగ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ చీరల పంపిణీ ప్రభుత్వ కార్యక్రమమా? ప్రైవేటు కార్యక్రమమా?

## భారత రాష్ట్ర సమితి నాయకులు బరితెగింపు
## ప్రోటోకాల్ పాటించని నాయకులు
## సోషల్ మీడియా పోకిరిల భరతం పట్టాలి
## ప్రోటోకాల్ ఉల్లంఘన పై మండిపడుతున్న ప్రజా సంఘాలు



బోనకల్, అక్టోబర్ 05 ప్రజా పాలన ప్రతినిధి: ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ అమలును పర్యవేక్షించవలసిన బాధ్యత మండల అధికారులు మీదనే ఉందని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు అన్నారు. మండల కేంద్రంలోని గురువారం ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ప్రభుత్వ కార్యక్రమమా? ప్రైవేటు కార్యక్రమా? ప్రజలకు చెప్పాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో రాజకీయ జోక్యం తగదన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించకుండా ప్రవేటు వ్యక్తులు పోటీలు పడి చీరలు పంపిణీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. చాలా గ్రామాల్లో గ్రామస్థాయి బిఆర్ఎస్ నాయకులు చీరలు ఎలా పంపిణీ చేస్తారని? వారేమన్నా చట్టబద్ధంగా రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన వారా అని ప్రశ్నించారు. కార్యక్రమాలను పర్యవేక్షించాల్సిన అధికారులు మౌనంగా ఉండటం ప్రజాస్వామ్యానికి ప్రమాదం అన్నారు.

**సోషల్ మీడియా పోకిరిల భరతం పట్టాలి...**

కొంతమంది పోకిరీలు ఉదయం మొదలుకొని అర్ధరాత్రి వరకు సోషల్ మీడియా గ్రూపుల్లో విచ్చలవిడిగా ఎడిటింగ్ పోస్టింగ్లను అప్లోడ్ చేసన్తా అనభ్యకర మైనటువంటి పదజాలాలతో పని పాట లేకుండా భావద్వేగాలు రెచ్చగొట్టే ప్రచారాలు,తప్పుడు ఎడిటింగ్ ప్రచారాలు చేస్తూ సామాన్య ఓటర్లను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. సామాన్యుడి స్వేచ్ఛగా తన ఓటు హక్కును వినియోగించుకోవాలంటే సోషల్ మీడియా వేదికలలో గందరగోళాన్ని సృష్టించే పోకిరిల భరతం పట్టాలని, వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇప్పించాలని ఆయన పోలీసు వారికి విజ్ఞప్తి చేశారు.

**ప్రోటోకాల్ పాటించని వారిపైన చర్యలు తీసుకోండి...**

ప్రభుత్వ చీరల పంపిణీ కార్యక్రమాల్లో ప్రైవేటు వ్యక్తులు (ప్రోటోకాల్ పరిధిలో లేని వారు) చీరలు ఎలా పంపిణీ చేస్తారన్నాం ఁ? చీరల పంపిణీ కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు సేకరిస్తున్నామని, ప్రైవేట్ ఖద్దరు వ్యక్తుల అత్యుత్సాహం వల్ల రాజ్యాంగ బద్ధంగా ఎన్నుకున్న ప్రజాప్రతినిదులు ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సభలు సమావేశాలలో మహిళలను సహితం నెట్టుకుంటూ సభా వేదికల మీద చౌరబడుతున్నారని, ప్రోటోకాల్ పరిధిలోగల ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలలో సహితము వీరు వేదికల మీద తమంతట తామే బహటముగా కూర్చుంటున్నారని ఇది మంచి పద్ధతి కాదన్నారు. రాజ్యాంగ భద్ధముగా ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులదే ప్రధమ స్థానమన్నారు. ఇకనైనా ప్రభుత్వ కార్యక్రమంలో సంబంధం లేని ప్రవేటు రాజకీయ వ్యక్తులు ప్రమేయాన్ని అడ్డుకోవాలని వినని వారిపైన తగు చర్యలకు సిఫారస్ చేయాలనే మండల అధికారులను అయన కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఆకెన పవన్, సిపిఐ మండల నాయకులు యంగల పెద్ద రమేష్, యంగల రాములు, యంగల పెద్ద వుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాచకొండ పోలీస్ కమిషనర్ డిఎస్ చౌహాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కార్పొరేటర్లు



మేడిపల్లి, అక్టోబర్ 5 (ప్రజాపాలన ప్రతినిధి) :పీర్జాదిగూడ మున్సి పల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లిలో రాచకొండ పోలీస్ కమిషనరేట్ నూతన కార్యాలయానికి భూమి పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర హెూం మంత్రి మహమ్మద్ అలీని,రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి మరియు రాచకొండ పోలీస్ కమిషనర్ డిఎస్ చౌహాన్ లను పీర్జాదిగూడ 11వ డివిజన్ కార్పొరేటర్ మద్ది యుగంధర్ రెడ్డి,21వ డివిజన్ కార్పొరేటర్ మధుసూదన్ రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## బీసీ గణన చేసిన బీహార్ సిఎం నితీష్ కుమార్‌కు పాలాభిషేకం




మంచిర్యాల టౌన్, అక్టోబర్ 05, ప్రజాపాలన : మంచిర్యాల పట్టణంలోని ఐ బి చౌరస్తాలో గురువారం బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ బీసీ కుల గణన చేపట్టి బహిర్గతం చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని హర్షం వ్యక్తం చేస్తూ బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టని బీసీ కుల గణనను చేపట్టి దేశానికి ఆదర్శంగా నిలిచిన బీసీల పక్షపాతి బీహార్ సి ఎం నితీష్ కుమార్ అని అన్నారు. దేశంలో ఉన్న అనేక పార్టీలు బిసి కుల గణన కు వెనకడుతున్న నేపథ్యం కేంద్రంలోని బిజెపి బీసీ గణన పై మొండి వైఖరి అవలంబిస్తున్న తరుణంలో కుల దుహంకారులు సుప్రీంకోర్టులో కేసు వేసిన సందర్భం సుప్రీంకోర్టు బీసీ కుల గణన రాష్ట్ర ప్రభుత్వల పరిధిలోకి రాదు కదా అని చెప్పిన కేంద్ర ప్రభుత్వమే బిసి కుల గణన చేపట్టాలని చెప్పిన చేయడం లేదు అని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వం అనేక ఇబ్బందులకు గురి చేసినప్పటికీ బిసి కుల గణన తోనే బీసీల సాధికారిక సాధ్యమని బీసీ గణన చేపట్టి బీసీల న్యాయమైన డిమాండ్ పరిష్కరించి బీసీల పక్షపాతిగా నిలబడిన వ్యక్తిగా మిగతా రాష్ట్రాలలో ఉన్న ముఖ్యమంత్రులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని టిఆర్ఎస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటనే బి సి కుల గణన చేపట్టి బీసీల పక్షపాతిగా నిలబడాలని కోరారు. లేని పక్షంలో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటుతో తగిన బుద్ధి చెప్పక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి సంఘం లక్ష్మణ్ రాష్ట్ర నాయకులు గజ్జెల్లి వెంకటయ్య శ్రీపతి రాములు చంద్రగిరి చంద్రమౌళి కీర్తి బిక్షపతి ఇన్నారం కిరణ్ కాగితాల సత్యనారాయణ కొంతం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పండుగలకు కొత్త బట్టలు కొత్త చీరలు ఇస్తున్న ఘనత భారత రాష్ట్ర సమితి పార్టీకే దక్కింది



తాండూర్ ప్రజా పాలన ప్రతినిధి : పండుగలకు కొత్త బట్టలు కొత్త చీరలు ఇస్తున్న ఘనత భారత రాష్ట్ర సమితి పార్టీకే దక్కిందని తాండూర్ శాసనసభ్యులు పైలట్ రోహిత్ రెడ్డి అన్నారు. గురువారం రోజు బషీరాబాద్ తాండూరు మండలంలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కళ్యాణ లక్ష్మి, క్రికెట్ కిట్లను, బీసీ బంద్ చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కెసిఆర్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందని అన్నారు. బీసీ బందు ద్వారా లక్ష రూపాయల చెక్కులను వారికి అందించి స్వయం ఉపాధి ఉపాధి పొందాలని లక్ష్యంతో బిసి బంధం ఏర్పాటు చేసి అందించడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా దళిత బంధు రెండో విడత ప్రారంభమైందని ఎంపిక చేయుటకు అధికారులు విచారణలు చేస్తున్నారని అనేక పథకాలను అమలు చేయడంలో టిఆర్ఎస్ ముందంజలో ఉందని అన్నారు. బషీరాబాద్ లో జరిగిన సమావేశంలో బషీరాబాద్ ఇంచార్జ్ ఎంపీడీవో రమేష్, మండల ఎంపీపీ అధ్యక్షురాలు కరుణ , బషీరాబాద్ మండల జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి,భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు రాజు నర్సిరెడ్డి పిఎసిఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి ,ఎంపిటిసి, సర్పంచులుతదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న తాసిల్దార్

బోనకల్, అక్టోబర్ 05 ప్రజా పాలన ప్రతినిధి: మండల పరిధిలోని తూటికుంట్ల, లక్ష్మీపురం గ్రామాలలో గురువారం చేపట్టిన బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో తాసిల్దార్ పున్నం చందర్ పాల్గొన్నారు. ఈ చీరలు పంపిణీ కార్యక్రమాన్ని తాసిల్దార్, ఆయా గ్రామాల సర్పంచ్ ల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా తాసిల్దార్



మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆడపడుచుల ఆత్మగౌరవాన్ని పెంపొందించే విధంగా బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టిందని తెలియజేశారు. అదేవిధంగా తూటికుంట్ల గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నందు యువకులకు క్రీడా సామాగ్రి కిట్టును అందజేశారు. ఈ కార్యక్రమంలో తూటి కుంట్ల గ్రామ సర్పంచ్ నోముల వెంకట నరసమ్మ, లక్ష్మీపురం గ్రామ సర్పంచ్ నన్నక లక్ష్మి, తాసిల్దార్ పున్నం చందర్, గిర్దవర్ గుగులోత్ లక్ష్మణ్, మండల రైతుబంధు కన్వీనర్ వేమూరి ప్రసాద్, మాజీ ఎంపీపీ తుళ్లూరు రమేష్, ఐకెపి సిబ్బంది శ్రీనివాసరావు, ఆయా గ్రామాల రేషన్ డీలర్లు, వివో ఏలు, మహిళలు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ పాలనలోనే ఇల్లూరు అభివృద్ధి

**మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారి నాగేశ్వరావు**

మధిర రూరల్ అక్టోబర్ 5 ప్రజాపాలన ప్రతినిధి మండలం పరిధిలో అధికార బిఆర్ఎస్ పార్టీ పాలనలోనే ఇల్లారు గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని మాజీ మార్కెట్ కమిటీ



చైర్మన్ చిత్తారి నాగేశ్వరరావు అన్నారు గ్రామానికి ఎస్ డి ఎఫ్ ద్వారా మంజూరైన పది లక్షల రూపాయలతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు ఎంపీపీ మెండెం లలిత సర్పంచ్ కోట రామారావు తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు సహకారంతో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జవ్వాది రవి, ప్రసాద్ దామా కిషోర్ తదితరులు పాల్గొన్నారు

## పూర్వ విద్యార్థుల సంఘం వయో వృద్ధులు సంఘం వారి ఆధ్వర్యంలో ఘనంగా రిటైర్డ్ ఉపాధ్యాయులు సన్మానం



మధిర అక్టోబర్ 5 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో పూర్వ విద్యార్థుల సంఘం వయో వృద్ధుల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సం, వయో వృద్ధుల వారోత్సవాలు పురస్కరించుకుని, ఈరోజు పూర్వ విద్యార్థి సంఘం, వయో వృద్ధుల సంఘం, సంయుక్త ఆధ్వర్యంలో, మధిర పాఠశాలలో చదువుకుని, ఉపాధ్యాయులుగా పనిచేసి, రిటైర్ అయ్యి, వృద్ధాప్యం, అనారోగ్యం వల్ల, మధిరలో తమ ఇండ్లకు పరిమితమైన ఈక్రింది వారిని, శాలువా, మెమెంటో, పండ్లతో, సత్కరించి, ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. బోడేపుడి విశ్వనాధం చలువాది జనార్ధనరావు కొంకా నారాయణ చేడే రామకోటేశ్వరరావు . సుగుణమ్మ బచ్చలకూరి ఏసురత్నం భార్య లిదానమ్మ సిలివేరు డానియెల్ భార్య ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా పాల్గొన్న, మండల విద్యాధికారి ఎమ్.ప్రభాకరరావు , ఆల్ ఇండియా సీనియర్ సిటిజన్స్ కాన్ఫెడషన్ సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు మాధవరపు నాగేశ్వరరావు , సన్మానిత మాజీ ఉపాధ్యాయుల అంకిత భావాన్ని, పూర్వ విద్యార్థి, వయో వృద్ధ సంఘాల సేవా నిరతిని కొనియాడారు.ఈ కార్యక్రమంలో, సంబంధిత సంఘాల బాధ్యులు, పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, నాగేశ్వరరావు, ఇరుకుళ్ల లక్ష్మీ నరసింహారావు, ఎంద్రపల్లి పద్మావతి, పబ్బతి రమేష్, ఎడవల్లి నాగభూషణం, కటుకూరి శ్యామారావు, మధిర డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి సంఘ అధ్యక్ష్యులు అశోక్ పాల్గొన్నారు: మాధవరపు నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన కొండూరు సుధాకర్ పాదయాత్ర..


**అడుగడుగునా నీరాజనం పలికిన ప్రజలు..**



తల్లాడ, అక్టోబర్ 5 (ప్రజా పాలన న్యూస్): తల్లాడ మండలంలోని పాత పినపాక గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నత్తుపల్లి నియోజకవర్గ పార్టీ నాయకులు, రాష్ట్ర కో ప్రచార కమిటీ చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడు కొండూరు సుధాకర్ గురువారం పాదయాత్రను చేపట్టారు. ఈ పాదయాత్రను పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. తొలుత పినపాకలోని దేవాలయంలో కొండూరు సుధాకర్ దంపతులతో పాటు ఖమ్మం మాజీ డిసిసిబి చైర్మన్ మువ్వా విజయబాబు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అక్కడనుండి మహిళలు భారీగా హాజరై కార్యకర్తల నినాదాలతో పాదయాత్రను ప్రారంభించారు. మహిళలు గిరిజన వేషధారణలో వేసుకొని ఉత్సాహంగా పాదయాత్రలో ముందుకు సాగారు. ఈ సందర్భంగా పాదయాత్ర పాత పినపాక, స్టేజి పినపాక, అంబేద్కర్ నగర్ మీదుగా రెడ్డిగూడెం వరకు సాగింది. పాదయాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల నాయకులు గోపిశెట్టి వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి రమేష్, గొల్లగూడెం సర్పంచ్ నారపోగు వెంకటేశ్వర్లు, ఎర్రి నరసింహారావు, పొట్టేటి బ్రహ్మ రెడ్డి, తూము వెంకటనారాయణ, పొట్రు శ్రీనివాసరావు, మాగంటి శ్రీనివాసరావు, పగడాల లచ్చిరెడ్డి, బానోతు నరసింహారావు, తల్లాడ మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజలు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా బిఆర్ఎస్ పార్టీ వెన్నంటి ఉంటుంది: జడ్పిటిసి అవినాష్ రెడ్డి

**జడ్పిటిసి అవినాష్ రెడ్డిని అభినందించిన ఐటీ శాఖ మంత్రి కేటీఆర్**




ప్రజాపాలన ప్రతినిధి షాబాద్: షాబాద్ మండలంలో గత వారం కేటీఆర్ పర్యటన రోజు సభకు వచ్చి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అంతారం గ్రామానికి చెందిన సురేందర్ రెడ్డి కుటుంబానికి అండగా నిలిచిన జెడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి. సురేందర్ రెడ్డి కుటుంబానికి రూ. 10 లక్షల సహాయం రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి మహేందర్ రెడ్డి, ఎంఎల్ఏ యాదయ్య, ఎంపీ రంజిత్ రెడ్డి చేతుల మీదుగా అందించారు. పార్టీ తరపున మరో రూ. 2 లక్షలు ఇస్తామని కేటీఆర్ ప్రకటించారు. వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్పర్సన్ పట్నం సునీత రెడ్డి, వైస్ చైర్మెన్ విజయ్ కుమార్, మున్సిపల్ చైర్పర్సన్ మంజుల రమేష్ , రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద పటేల్,ఎంఎల్ఏ మహేష్ రెడ్డి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నర్సింగ్ రావు, మధుసూధన్ రెడ్డి, సతీష్ రెడ్డి, మల్లారెడ్డి, రాజేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

## ఉప్పల్ డివిజన్లో మౌలిక వసతుల కోసం రూ 2.5 కోట్లు మంజూరు



మేడిపల్లి, అక్టోబర్ 5 (ప్రజాపాలన ప్రతినిధి): ఉప్పల్ డివిజన్లోని సమస్యలను ప్రజల విన్నపం మేరకు ఉప్పల్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి డివిజన్లోని కుర్మానగర్, లక్ష్మీ నగర్ కాలనీ, విజయపురి కాలనీ, శ్రీ రమణపురం పోచమ్మ టెంపుల్ రోడ్, వెంకటేశ్వర కాలనీ, ఉప్పల్ హిల్స్ పలు కాలనీల్లో మౌలిక వసతులు, రోడ్లు వేయించుటకు ప్రత్యేక చొరవ తీసుకొని సుమారు రూ 2 కోట్ల 5 లక్షల రూపాయలు మంజూరు చేయించారు. గత వారం రోజుల క్రితం బండారి లక్ష్మారెడ్డి సూచన మేరకు జోనల్ కమిషనర్ పంకజకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది, దానికి అనుగుణంగానే ఈరోజు నిధులు మంజూరు చేయించినందుకు ఉప్పల్ డివిజన్ తరఫున బండారి లక్ష్మారెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నామం. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు ఆకుల మహేందర్ అడ్వకేట్, అన్య బాలకృష్ణ, సుక్క కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులకు భోజన ప్లేట్ల పంపిణీ



శంకరపట్నం అక్టోబర్ 05 ప్రజాపాలన రిపోర్టర్: శంకరపట్నం మండలం రాజాపూర్ లోని ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం తాడికల్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మూతి సత్యనారాయణ యూత్ సభ్యుల దాతృత్వాన్ని కొనియాడాను. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది యూత్ సభ్యులు హనుమాన్ల సాయి చరణ్, దుస్సా సాగర్, ఏ.అన్నపూర్ణ పాల్గొని 40 మంది విద్యార్థులకు ప్లేట్లను పంపిణీ చేశారు.

# డబల్ బెడ్రూం ఇండ్ల పట్టాలను పంపిణీ చేసిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి




మేడిపల్లి, అక్టోబర్ 5 (ప్రజాపాలన ప్రతినిధి) :ఉప్పల్ నియోజకవర్గం మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖమంత్రి వర్యులు సబిత ఇంద్రా రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, ఉప్పల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొని పేద ప్రజలకు డబల్ బెడ్రూం ఇండ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశల వారీగా డబుల్ బెడ్రూం ఇండ్లను పంపిణీ చేస్తామని, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా అర్హులను ఎంపిక చేసినట్లు , అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ అందజేస్తామని తెలిపారు. మూడు, నాలుగవ విడత ఉప్పల్ నియోజకవర్గంలో 1717 ఇండ్ల రాగ, ఇప్పటివరకు ఉప్పల్ నియోజకవర్గంలో 2845 ఇండ్లు పంపిణీ చేసామని. మరిన్ని డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని తెలిపారు. ఆ తర్వాత గృహలక్ష్మి పథకం కింద పేదవారికి ఇంటి నిర్మాణంలో సాయం అందజేస్తామన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే డబుల్ బెడ్రూం ఇండ్లను కేటాయిస్తున్నట్లుగా చెప్పారు. మూడు, నాలుగవ విడతలలో ఇండ్లు రాలేవని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. లబ్ధిదారులను సమావేశ వేదికల వద్దకు తీసుకువచ్చేందుకు ప్రత్యేక ఏర్పాటు చేసినట్లుగా వివరించారు. డబుల్ బెడ్ రూమ్ మంజూరు పత్రాలను అందుకున్న లబ్ధిదారులకు గృహప్రవేశం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జేరిపోతుల ప్రభుదాస్, బోంతు శ్రీదేవి ,పన్నాల దేవేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు,పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, సింగి రెడ్డి ధన పాల్ రెడ్డి, గోల్లూరి అంజయ్య , గుండారపు శ్రీనివాస్ రెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ డి.ఈ. గంగాధర్ , ఏఈ. వెంకటేశ్వర్లు , ఎమ్మార్వో వెంకట్ నరసింహారెడ్డి, ఉప్పల్ మున్సిపల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, బిఆర్ఎస్ నాయకులు జానుంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, గరిక సుధాకర్, కాటి పల్లి రవీందర్ రెడ్డి, నాగిల్ల బాల్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, కుమారస్వామి,రెడ్డి నాయక్, బిఆర్ఎస్ నాయకులు , మహిళలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి క్రీడల్లో సత్తా చాటిన మహాత్మ జ్యోతిబాపూలే కళాశాల విద్యార్థులు



బోనకల్, అక్టోబర్ ఐదు ప్రజా పాలన ప్రతినిధి:జిల్లా స్థాయి క్రీడలలో బోనకల్ మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఓరల్ ఛాంపియన్ గా నిలిచారు. తనికెళ్ల బీసీ గురుకుల పాఠశాలలో 1,2,3,4 తారీకులలో జరిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల క్రీడా పోటీలలో బోనకల్ మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి సత్తా చాటారు. ఈ పోటీలలో విద్యార్థులు గేమ్స్ అండ్ స్పోర్ట్స్ లో విద్యార్థులు ఎక్కువ పథకాలను సాధించారు. విద్యార్థులను ఆర్ సి ఓ మేడం అంజలి , కళాశాల ప్రిన్సిపాల్ సుష్మా , పి ఈ టి వెంకట్రావు అధ్యాపక బృందం క్రీడాకారులను అభినందించారు.

## బాల్య వివాహాలు చట్టపరంగా నేరం: రూరల్ ఎస్సై ఎండి రఫీ




మధిర రూరల్ అక్టోబర్ 5 ప్రజాపాలన ప్రతినిధి మండలం పరిధిలో ఖజీపురం గ్రామంలో రూరల్ పోలీస్ స్టేషన్లో బాల్య వివాహాల నిషేధిత అవగాహన వాల్ పోస్టర్లను రూరల్ ఎస్సై తన సిబ్బందితో కలిసి రూరల్ పోలీస్ స్టేషన్ నందు ఆవిష్కరించారు. బాల్యవాహాల నిషేధించడం చట్టం 2006 ప్రకారం 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు 21 సంవత్సరాలు లోపు మగ పిల్లలకు వివాహ చేయటం చట్టారీత్యా నేరమని రూరల్ ఎస్సై ఎండీ రఫీ అన్నారు. బాల్య వివాహ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## మేడిపల్లిలో రాచకొండ పోలీస్ కమిషనరేట్ నూతన కార్యాలయ భవనానికి భూమి పూజోత్సవం



మేడిపల్లి, అక్టోబర్ 5 (ప్రజాపాలన ప్రతినిధి) :పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన రాచకొండ పోలీస్ కమిషనరేట్ నూతన కార్యాలయ భవనానికి భూమి పూజా కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమ్మద్ అలీ, కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్.చౌహన్, మల్కాజ్గిరి డీసీపీ జానకి, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొని భూమి పూజా చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, గ్రంధాలయ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి, జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కార్పొరేటర్లు సుభాష్ నాయక్, మద్ది యుగంధర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడే ఖమ్మంపాడు యుపిఎస్ పాఠశాల అల్పాహారం పైలట్ ప్రాజెక్ట్ ఎంపిక




మధిర రూరల్ అక్టోబర్ ఐదు ప్రజా పాలన ప్రతినిధి మండలం పరిధిలో అల్పాహారం పైలెట్ ప్రాజెక్టు గాయుపిఎస్ ఖమ్మంపాడు పాఠశాల ఎంపిక శుక్రవారం నాడు ఉదయం జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమలరాజు చేతుల మీద పథకం ప్రారంభం6 వ తేదీ నుండి 12 వ తేది వరకు గ్రామ పెద్దలు డి సి సి బి వైస్ చైర్మన్ దొండపాటి. వెంకటేశ్వరరావు సౌజన్యం తో విద్యార్థులకు అల్పాహారం మండల విద్యాశాఖాధికారి వై.ప్రభాకర్ఈ నెల 24 వ తేదీ దసరా పండుగ రోజు రాష్ట్ర వ్యాప్తం గా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అల్పాహారం అందించే పథకాన్ని ముఖ్యమంత్రి కెసిఆర్ చేతుల మీదగా ప్రారంభంలి అవుతున్న సందర్భం లో రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి ఒక పాఠశాలను పైలెట్ ప్రాజెక్టు గా చేపట్టి అల్పాహారం పథక తీరుతెన్నులను గమనించాలని నిర్ణయించడం తో నియోజవర్గం మధిర మండలం లో లియుపిఎస్ ఖమ్మంపాడులి ఎంపికకాబడిందని,రేపు శుక్రవారం నుండి ఈ పథకాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల.కమలరాజు చేతులు మీదగా ప్రారంభిస్తున్నామని,అల్పాహారానికి అయ్యే ఖర్చును పెట్టుకోవడానికి ముందుకొచ్చిన దొండపాటి. వెంకటేశ్వరరావు కి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని మండల విద్యాశాఖాధికారి వై .ప్రభాకర్ తెలిపారు. లికార్యక్రమానికి జిల్లా విద్యా శాఖాధికారి ఏపూరి. సోమశేఖర శర్మ , తాసిల్దార్ వెంకటేశ్వర్లు ఎంపీడీవో, శిలారుసాహెబ్ , ఎంపీపీ మెండెం. లలిత, వైస్ ఎంపీపీ సామినేని. సురేష్,గ్రామ సర్పంచ్ దొండపాటి. రుక్మిణమ్మ ,గ్రామ పెద్దలు,విద్యార్థులతల్లి,దండ్రులు,ఉపాధ్యాయులు హాజరు కానున్నారు.

## తెలంగాణ సాంస్కృతిక వారసత్వ పండుగ బతుకమ్మ: సర్పంచ్ యంగల దయామని



బోనకల్, అక్టోబర్ 05 ప్రజా పాలన ప్రతినిధి : ఆచారాలు, సాంప్రదాయాలు, పద్ధతులను తెలిపే బతుకమ్మ పండుగను తెలంగాణ రాష్ట్ర వారసత్వ పండుగగా భావిస్తామని, ఔషధ గుణాలున్న పూలను పేర్చి ఆడుకోవడానికి ప్రభుత్వం పంపిణీ చేసిన చీరలను మహిళలు ధరించుకొని ఐకమత్యంతో ఉండి ఆట, పాట లతో సమిష్టిగా పండుగ జరుపుకోవాలని సర్పంచ్ యంగల దయామణి అన్నారు. మండలంలోని కలకోట గ్రామపంచాయతీ లో గురువారం బతుకమ్మ చీరల పంపిణీ లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం పంపిణీ చేసిన బతుకమ్మ చీరలను,ఉప సర్పంచ్ చావా హరిత,ఎంపీటీసీ యంగల మార్థమ్మ పంచాయతీ కార్యదర్శి బుద్ధుల లక్ష్మి తో కలిసి మహిళలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ సుంకర రామారావు, గ్రామ సమైక్య సభ్యులు బరుగుల వెంకమ్మ,గ్రామదీపికలు పాపమ్మ, నందిని,ఆరోగ్య సిబ్బంది విజయరత్నం తదితరులు పాల్గొన్నారు.

## సీఎం గారు మా సమస్యలపై దృష్టి సారించండి: టి జి పి ఏ ఎల్ ఏ




హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి ): సాంకేతిక విద్యను బోధిస్తున్న తమ సమస్యల పై దృష్టి సారించాలని తెలంగాణ గెజిటెడ్ పాలిటెక్నిక్ ఆల్ లెక్చరర్స్ అసోసియేషన్ ( టి జి పి ఏ ఎల్ ఏ) ముఖ్యమంత్రి కేసీఆర్ కు విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరసయ్య గౌడ్, చక్రవర్తి లు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అప్పటి ఉద్యమ నేత నేటి ముఖ్యమంత్రి కి అండగా ఉన్న తమను నిర్లక్ష్యం చేయడం తీవ్ర విచారకరమని అన్నారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు పాలిటెక్నిక్ విద్య కు ఉన్న ప్రాధాన్యత స్వరాష్ట్రంలో లేకపోవడం సైతం తమను తీవ్రంగా కలచి వేస్తుందని చెప్పారు. సుమారు 40 వేల మందికి పైగా విద్యార్థులు ఉండగా కేవలం 1200 లెక్చరర్స్ ఉన్నారని అన్నారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఆరు కాలేజీలు నూతనంగా ఏర్పాటు చేసిన పూర్తి సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. 2021లో వేతన సవరణ చేసినప్పటికీ 2016 నుంచి 2021 వరకు రావాల్సిన వేతన బకాయిలు ఇప్పటికీ తమ భవిష్యనిది ఖాతాలో జమ చేయలేదని అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి తమ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో అసోసియేషన్ సభ్యులు సురేష్, మురళి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## పశువైద్య శిబిరం విజయవంతం



బోనకల్,అక్టోబర్ 5 ప్రజా పాలన ప్రతినిధి: మండల పరిధిలోని రామాపురం గ్రామంలో గురువారం జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ వైరా ఆధ్వర్యంలో గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం గ్రామ సర్పంచ్ తొండపు వేణు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గోవిందాపురం పశువైద్యాధికారి ఇ. ప్రవీణ్, గోపాల్ మిత్ర సూపర్వైజర్ మోతుకూరి వెంకటేశ్వర్లు పాల్గొని 32 ఆవులు, గేదెలకు గర్భకోశ వ్యాధి చికిత్సలు ఉచితంగా చేశారు. గేదె, దూడలకు నట్టలు నివారణ మందులు త్రాగించడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎడ్లపల్లి నరసయ్య, చిగురుపాటి నాగేశ్వరరావు, గార్లపాటి కోటేశ్వరరావు, తిరుమలి,సారిక లింగస్వామి, పశువైద్య సిబ్బంది వెటర్నరి అసిస్టెంట్ చిన్నయ్య, గ్రామ గోపాలమిత్ర నాగుల్ మీరా, వాసు, ప్రవీణ్, పశుమిత్ర త్రివేణి పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన భరత్ స్కూల్ విద్యార్థులు




మధిర అక్టోబర్ ఐదు ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన భరత్ విద్యార్థులు సెంట్రల్,రాష్ట్ర ఎలక్షన్ కమీషనర్ల ప్రశంసలు అందుకున్న భరత్ విద్యార్థులులి భరత్ విద్యాసంస్థల విద్యార్థులు భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ నిర్వహించిన స్కిట్ (లఘు నాటిక) మండల,నియోజకవర్గ,జిల్లా స్థాయి దాటి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం జరిగింది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్ లోని టెక్ మహీంద్రా లెర్నింగ్ వరల్డ్ సెమినార్ హాల్ నందు సెంట్రల్ ఎలక్షన్ కమీషనర్ రాజీవ్ కుమార్,తెలంగాణా రాష్ట్ర ఎన్నికల కమీషనర్ వికాస్ రాజ్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించగా ఈ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన భరత్ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా భరత్ విద్యా సంస్థల అధినేత శీలం విద్యాలత వెంకటరెడ్డి మాట్లాడుతూ మధిర స్థాయి నుండి నేడు రాష్ట్ర స్థాయికి చేరుకొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జింకల కోటేశ్వరరావు,ఉమా,డీన్ రవీందర్ రెడ్డి,స్రవంతి తదితర ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

## ఏపీజీవీబీ వారి సేవలను సద్వినియోగం చేసుకోండి



మధిర రూరల్ అక్టోబర్ 5 ప్రజాపాల ప్రతినిధి మండలం పరిధిలో ఏపీజీవీబీ బ్యాంక్ మధిర వారి ఆధ్వర్యంలో రొంపిమాళ్ళ గ్రామంలో గ్రామస్తులకు అవగాహన సదస్సు.. పొదుపు పథకాలు, జీవిత బీమా, ప్రభుత్వానికి సంబంధించిన రాయితీలు మొదలైన వాటిపై ప్రజలకు అవగాహన కల్పించి ఏపీజీవీబీ వారి సేవలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఏపీజీవీబీ బ్యాంక్ ఉద్యోగస్తులు సిబ్బంది గ్రామ ప్రజలకు సంపూర్ణ అవగాహనను కలిగించారు. ఈ కార్యక్రమంలో గొల్లమందల శ్రీను, గ్రామ ప్రజలుపాల్గొన్నారు.

## గృహలక్ష్మి కొరకు తాశీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష




మధిర అక్టోబర్ ఐదు ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో ఇంటి స్థలం కొరకు గిరిజన మహిళ చమ్మ సత్తి సామ్రాజ్యం గత 40 సంవత్సరాల నుండి మధిరలో ఒంటరి మహిళ పిల్లలతో అద్దె ఇళ్లల్లో కాలం వెళ్లదీస్తుంది. తెలంగాణ రాష్ట్రం వచ్చినప్పటినుండి మంచి రోజులు వస్తాయని డబల్ బెడ్ రూమ్ వస్తుందని ఆశగా ఎదురుచూస్తుంది. ప్రభుత్వం నేడు గృహలక్ష్మి పథకం కింద తనలాంటి పేదలకు ఇల్లు ఇస్తుందని ఆశపడింది. తనకు మాత్రం ఇల్లు ఇవ్వకుండా అన్ని అవకాశాలున్న డబ్బున్న వారికి మాత్రమే ఇల్లు రావడాని గమనించి తనకు ఇల్లు రావటం లేదని తెలిసి ఎలా బ్రతకాలో అర్థం కాక తన సామాన్లతో ఆరోగ్యం బాగాలేని కొడుకుని తీసుకొని మాకు ఇల్లు కేటాయించాలని కోరుతూ తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేస్తున్నది. పేద గిరిజన మహిళ చేస్తున్న పోరాటానికి సంఘీభావం తెలియజేస్తున్నారు.

## బతుకమ్మ చీరల పంపిణీ ప్రారంభించిన సర్పంచ్




బోనకల్ అక్టోబర్ 05 ప్రజా పాలన ప్రతినిధి: మండల పరిధిలోని ఆళ్లపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం నందు గురువారం దసరా పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆడపడుచులకు ఇచ్చే బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ మర్రి తిరుపతిరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక ప్రతీక బతుకమ్మ పండగని, ఈ బతుకమ్మ పండుగను ఆడపడుచులు అత్యుత్సాహంతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ షేక్ సత్తార్ మీయా, పంచాయతీ కార్యదర్శి పరశురాం , బతుకమ్మ చీరల లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఓటీటీలో స్ట్రీమింగ్ కి వచ్చేసిన "మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి"




మన టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి హీరోయిన్ గా చాలా కాలం గ్యాప్ అనంతరం చేసిన అవైటెడ్ సినిమానే "మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి". మరి అనుష్క స్టార్ పవర్ కి తోడుగా యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో నవీన్ పొలిశెట్టి హీరోగా అంతేకాకుండా ప్రమోషన్స్ లో కూడా సినిమాని ప్రేక్షకుల్లో మరింత బలంగా తీసుకెళ్లేందుకు అయితే చాలా కష్టపడ్డాడు. ఫైనల్ గా మంచి ఫలితాన్ని తన ఖాతాలో వేసుకోగా ఇప్పుడు ఈ అవైటెడ్ సినిమా ఓటీటీలో అయితే అలరించేందుకు వచ్చేసింది. మరి ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులు నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకోగా ఇందులో ఈ చిత్రం పాన్ ఇండియా భాషల్లో అయితే ఇప్పుడు స్ట్రీమింగ్ కి వచ్చేసింది. మరి ఇప్పుడు చూడాలి అనుకునేవారికి అయితే ఈ వీకెండ్ లో ఈ చిత్రం మంచి ఎంటర్టైనర్ గా నిలుస్తోంది. ఇక ఈ చిత్రానికి మహేష్ బాబు అనే కొత్త దర్శకుడు పని చేయగా యూవీ క్రియేషన్స్ వారు నిర్మాణం వహించారు.

## 'గుంటూరు కారం' పై క్రేజీ అప్ డేట్ అందించిన 'డీజే టిల్లు'




యువ నటుడు సిద్దు జొన్నలగడ్డ తాజాగా డీజే టిల్లు స్క్వేర్ మూవీలో హీరోగా నటిస్తున్నారు. మల్లిక్ రామ్ తెరకెక్కిస్తున్న ఈ మూవీ త్వరలో ఆడియన్స్ ముందుకి రానుంది. ఇక తాజాగా సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థల పై కళ్యాణ్ శంకర్ తెరకెక్కించిన మ్యాడ్ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ కి చీఫ్ గెస్ట్ గా విచ్చేశారు సిద్దు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్దిసేపటి క్రితమే చినబాబు గారు నాతో మాట్లాడుతూ ఒక మాట చెప్పారు. ఇవాళ గుంటూరు కారం మూవీలో ఒక సూపర్ సాంగ్ ని తెరకెక్కించారు. ఇటీవల కాలంలో ఇటువంటి సాంగ్ ని నేను చూడలేదు, తప్పకుండా రేపు రిలీజ్ తరువాత ఈ సాంగ్ కి థియేటర్స్ తగలబడిపోవడం ఖాయం అని అన్నారని చెప్పారు. నిజానికి చినబాబు గారు ఎక్కువగా మాట్లాడరని, అటువంటిది ఆయన ఈరోజు ఇలా చెప్పారు అంటే ఇక మీరే ఊహించుకోవచ్చని అన్నారు సిద్దు. మొత్తంగా సూపర్ స్టార్ మహేష్ బాబు గుంటూరు కారం పై రోజురోజుకు అంచనాలు పెరుగుతున్నాయి. ఓవైపు డైరెక్టర్ త్రివిక్రమ్ స్టోరీ, స్క్రిప్ట్, టేకింగ్ ని అదరగొడుతుంటే మరోవైపు మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సాంగ్స్, బీజీఎమ్ ని అత్యద్భుతంగా సిద్ధం చేస్తున్నారని, తప్పకుండా రానున్న సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల కానున్న గుంటూరు కారం ఆడియన్స్ కి సూపర్ ఫ్యాన్స్ కి ఫుల్ ఫీస్ట్ అందించడం ఖాయం అని తాజాగా ఒక ఇంటర్వ్యూలో భాగం నిర్మాత నాగవంశీ వెల్లడించారు. శ్రీలీల, మీనాక్షి చౌదరి ఈ మూవీలో హీరోయిన్స్ గా నటిస్తుండగా కీలక పాత్రల్లో రమ్యకృష్ణ, ప్రకాష్ రాజ్, జగపతి బాబు, రఘుబాబు, సునీల్, ఆలీ, హైపర్ ఆది నటిస్తున్నారు.

## సంఘవి పెళ్లిలో చాలా ట్విస్టులున్నాయే!



కన్నడ నటి సంఘవి టాలీవుడ్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఎన్నో సినిమాల్లో నటించారు. 'తాజ్ మహల్' సినిమాతో టాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చిన సంఘవి అటుపై 'ఊరికి మొనగాడు'.. 'తాత మనవడు'..'ఓహో నాపెళ్లంట' లాంటి సినిమాల్లో నటించారు. అయితే 'సింధూరం' సినిమాతో బాగా ఫేమస్ అయ్యారు. నటిగా ఆమెకి ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చిపెట్టిన చిత్రమది. అటుపై 'సూర్యవంశం'.. 'నాయుడుగారి కుటుంబం'..'సరదా బుల్లోడు' ..'సమరసింహారెడ్డి'..' సీతారామ రాజు' లాంటి చిత్రాలతో పాటు కొన్నేళ్ల పాటు టాలీవుడ్ లో తిరుగులేని నటిగా కొనసాగారు. కోలీవుడ్ లోనూ చాలా సినిమాలు చేసారు. చివరిగా తెలుగులో 2005లో 'ఒక్కడే కానీ ఇద్దరు' సినిమాలో నటించారు. ఆ తర్వాత మళ్లీ తెలుగు సినిమాలు చేయలేదు. ఇక మూడు నాలుగేళ్లగా ఇతర భాషలోనూ సినిమాలు చేయలేదు. అయితే ఆమె వ్యక్తిగత జీవితంలో చాలా ఆసక్తికర విషయాలే ఉన్నాయని తెలుస్తోంది. ఆమె కూడా ఆర్దిక కష్టాల జయించేందుకే సినిమాల్లోకి వచ్చారు. అయితే తలపతి విజయ్ సరసన నటించిన సినిమా సంఘవి కెరీర్ ని వ్యక్తిగతంగా టార్గెట్ చేసినట్లు కనిపిస్తోంది. సంఘవిని హీరోగా పెట్టి చంద్రశేఖర్ ఓ సినిమా డైరెక్ట్ చేసారు. ఆ తర్వాత వరుసగా మరో మూడు సినిమాలు తీసారు. అయితే ఈ క్రమంలోనే ఇద్దరు ప్రేమలో పడ్డారని ప్రచారం సాగింది. అది నచ్చని విజయ్ తండ్రి కారణంగా సంఘవికి కోలీవుడ్ లో అవకాశాలు లేకుండా చేసారని ప్రచారం సాగింది. ఇక రామానాయుడు సురేష్ ప్రొడక్షన్స్ లో ఆమె ఎన్నో సినిమాల్లో నటించారు. ఆ సమయంలోనే 'శివయ్య' సినిమాని డైరెక్ట్ చేసిన సురేష్ వర్మతో ప్రేమలో పడింది. అటుపై వివాహ బంధంతో 2000 లో ఒకటయ్యారు. అయితే ఈ పెళ్లి సంఘవి తల్లిదండ్రులకు ఇష్టం లేదు. దీంతో అప్పటి నుంచి కుటుంబ సభ్యులతో తెగ దెంపులు చేసుకుని వచ్చేసింది. ఆ తర్వాత సినిమాల్లో అవకాశాలు తగ్గడం...ఏడాదికే భర్తతో వివాదలు మొదలయ్యాయి. దీంతో ఇద్దరు విడాకులతో వేరయ్యారు. సురేష్ వర్మ వ్యక్తిగత టార్చర్ కారణంగానే విడాకులు తీసుకున్నారు అన్నది అప్పట్లో సంచలనంగా మారింది. ఆ తర్వాత కొన్నాళ్లకి తల్లి ఓ ఎన్ ఆర్ ఐ సంబంధం చూసిందిట. కానీ కొన్ని కారణాలతో అది సాధ్యపడలేదు. అటుపై కర్ణాటకకి చెందిన ఐటీ సంస్థ అధినేత వెంకటేషన్ ని 2016లో పెళ్లి చేసుకుంది. ప్రస్తుతం ఆ దంపతులుకు మైసూర్ లో స్థిరపడ్డారు.

## రామ్ డబుల్ ఆశలు.. ఆ ఇద్దరి చేతుల్లోనే



రామ్ పోతినేని ఇస్మార్ట్ శంకర్ సినిమాతో కెరీర్ లోనే బిగ్గెస్ట్ సక్సెస్ చూశాడు. పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించిన ఆ సినిమాలో మొదటిసారి రామ్ పూర్తి స్థాయిలో తెలంగాణ యాసతో మాట్లాడే ఎంతగానో అట్రాక్ట్ చేశాడు. అంతేకాకుండా ఆ సినిమాకు మ్యూజిక్ కూడా చాలా బాగా హెల్ప్ అయింది. మణిశర్మ అప్పటివరకు వరుస ప్లాప్స్ తో సతమతమవుతూ వచ్చాడు. కానీ పూరీ కాంబినేషన్ తో మళ్ళీ బౌన్స్ బ్యాక్ అయ్యాడు. అలాగే పూరి కూడా ఆ సినిమాతోనే సెట్ అయ్యి ఫామ్ లోకి వచ్చాడు అని అందరూ అనుకున్నారు. కానీ మళ్ళీ ఆ తర్వాత లైగర్ సినిమాతో ఊహించని విధంగా డిజాస్టర్ ఎదుర్కొన్నాడు. అయితే ఇప్పుడు మళ్లీ ఇదే కాంబినేషన్లో డబుల్ ఇస్మార్ట్ సినిమా రాబోతోంది. ఈ సినిమాను కూడా దర్శకుడు పూరి జగన్నాథ్ పాన్ ఇండియా రేంజ్ కు తగ్గట్టుగా నిర్మించే ప్రయత్నం అయితే చేస్తున్నాడు. బాలీవుడ్ ను అట్రాక్ట్ చేసేందుకు సంజయ్ దత్ ను కూడా రంగంలోకి దింపాడు. అయితే ఈ సినిమా పై రామ్ ఆశలు గట్టిగానే పెట్టుకున్నాడు. తప్పకుండా ఈ సినిమాతో సక్సెస్ అందుకొని మార్కెట్ను పెంచుకోవాలని చూస్తున్నాడు. కానీ దర్శకుడు పూరి మణిశర్మ ఇద్దరు కూడా ఈ సినిమాకు పర్ఫెక్ట్ అవుట్ పుట్ ఇస్తేనే సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్స్ అందుకునే అవకాశం ఉంటుంది. ముందుగా అయితే మణిశర్మ ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ చాన్స్ మిస్ చేసుకోకూడదు. ఇస్మార్ట్ శంకర్ సినిమా తర్వాత మళ్లీ కాస్త బిజీ అయినా మణిశర్మ ఆ తర్వాత సినిమాలతో వరుసగా నిరాశ పరుస్తూ వచ్చాడు. ఇక ఇప్పుడు డబుల్ శంకర్ తో మ్యూజిక్ తోనే మంచి అంచనాలను క్రియేట్ చేయాల్సిన అవసరం ఉంది. అంతే కాకుండా రామ్ కు కూడా సక్సెస్ ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఇక పూరి కూడా లైగర్ గాయాన్ని మర్చిపోయా విధంగా మరో పవర్ఫుల్ సక్సెస్ కొట్టాల్సిన అవసరం ఉంది. రామ్ పోతినేని తన రేంజ్ పెంచుకోవాలి అనుకున్న ప్రతిసారి కూడా డిజాస్టర్స్ ఎదురవుతున్నాయి. ఇస్మార్ట్ శంకర్ తర్వాత అతను తన రేంజ్ అంతకుమించి పెంచుకోవాలని ముందుకు సాగుతున్నాడు. ఇక ఇప్పుడు డబుల్ ఇస్మార్ట్ సక్సెస్ కావాలి అంటే పూరి డైలాగ్స్ స్క్రీన్ ప్లే స్టోరీ చాలా కొత్తగానే ఉండాలి. ఇక మణిశర్మ మ్యూజిక్ కూడా సినిమా విడుదలకు ముందే పాజిటివ్ వైబ్రేషన్స్ క్రియేట్ చేయాల్సిన అవసరం ఉంది. మరి రామ్ పెట్టుకున్న నమ్మకాన్ని ఈ ఇద్దరు నిజం చేస్తారో లేదో చూడాలి.

## కంప్లీట్ స్టార్ లా మనోళ్లకి సాధ్యం కాదా?




మాలీవుడ్ లో కంప్లీట్ స్టార్ మోహన్ లాల్...బాలీవుడ్ కిలాడీ అక్షయ్ కుమార్ ఎంత బిజీగా ఉంటారు? అన్నది చెప్పాల్సిన పనిలేదు. మోహన్ లాల్ ఏడాదికి కనీసం ఐదారు సినిమాలైనా రిలీజ్ అయ్యేలా ప్లాన్ చేసుకుంటారు. డే అండ్ నైట్ షూటింగ్ లు చేస్తారు. ఆయన సినిమాలు పూర్తిచేసి రిలీజ్ చేయడం అన్నది కేవలం మోహన్ లాల్ కే చెల్లింది. ఆ విషయంలో తనని చూసి నేర్చుకోవాలని మమ్ముట్టి సైతం నర్మగర్భంగా చెబుతుంటారు. నేటి తరం యువత ఆయన స్పూర్తితో ఎక్కువ సినిమాలు చేయాలని సూచిస్తుంటారు. ఇక బాలీవుడ్ లో అక్షయ్ కుమార్ కూడా అంతే బిజీగా ఉంటారు. ఏడాదికి కనీసం నాలుగు లేదా ఐదు చిత్రాలతో ప్రేక్షకుల ముందుకొస్తారు. చిన్న..పెద్ద అనే తేడా లేకుండా వచ్చిన ఏ అవకాశం వదిలిపెట్టరు. సినిమా ఎంత వేగంగా పూర్తి చేసి రిలీజ్ చేసాం? అన్న కోణంలో కిలాడీ వేగం కనిపిస్తుంది. రాబోయే రెండేళ్లకి సంబంధించి అక్షయ్ షెడ్యూల్ ఎంత టఫ్ గా ఉందో ప్రస్తుతం చేస్తోన్న సినిమాలు సంఖ్య చూస్తే అర్దమవుతుంది. పదికి పైగా సినిమాలు నిర్మాణ దశల్లో ఉన్నాయి. వాటిలో కొన్ని సినిమాలు కొన్ని వారాల్లో విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. 'మిషన్ రాణిగంజ్' ఈ శుక్రవారం విడుదలవుతెంది. ఇదొక సర్వైవల్ థ్రిల్లర్. అలాగే 'వేదాత్ మరాఠే వీర్ దౌడ్లే సాత్' సెట్స్ లో ఉంది. నవంబర్ లో ఈ సినిమా రిలీజ్ కానుంది. 'బడే మియాన్ చోటే మియాన్'.. 'స్కై ఫోర్స్'..' సూరరై పొట్రు రీమేక్' .'హేరా ఫేరి 3'.. 'శంకర' లాంటి సినిమాలు కూడా షూటింగ్ దశలో ఉన్నాయి. ఇంకా 'హౌస్ఫుల్ 5'.. 'వెల్‌కమ్ 3' ..'సింఘమ్ ఎగైన్' వంటి ఫ్రాంచైజీ చిత్రాలు కిలాడీ హ్యాండ్స్ లోనే ఉన్నాయి. ఇంకా షారుక్ ఖాన్... సల్మాన్ ఖాన్..అమీర్ ఖాన్ లాంటి హీరోలు లాంగ్ గ్యాప్ తీసుకున్నా! ఒకేసారి వాళ్లు చేసిన సినిమాలు ఒకదాని వెంట ఒకటి రిలీజ్ అయ్యేలా పక్కా ప్లాన్ చేసుకుంటారు. షారుక్ నటించిన 'పఠాన్'..'జవాన్' ఈ ఏడాది అలాగే రిలీజ్ అయ్యాయి. 'డుంకీ'తో త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్నారు. అయితే టాలీవుడ్.. కోలీవుడ్ హీరోలకు మాత్రం ఇలా అక్షయ్ కుమార్.. మోహన్ లాల్ లా సినిమాలు చేయడం మాత్రం సాధ్యపడటం లేదు.

## యూఎస్ లో రికార్డ్లు కొడుతున్న "లియో" ప్రీసేల్స్!




ఇళయ దళపతి విజయ్ జోసెఫ్ హీరోగా త్రిష హీరోయిన్ గా దర్శకుడు లోకేష్ కనగ రాజ్ తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం "లియో" కోసం అందరికీ తెలిసిందే. మరి ఈ చిత్రం ఇపుడు రిలీజ్ కి రాబోతుండగా మేకర్స్ ట్రైలర్ ని కూడా రిలీజ్ చేయబోతున్నారు. ఇక ఈ ట్రైలర్ లాంచ్ కోసం ఇప్పుడు సిద్ధం చేస్తుండగా ఇంకా ఈ ట్రైలర్ రాక ముందే యూఎస్ ప్రీమియర్స్ సేల్ లో అయితే రికార్డ్స్ కొడుతోంది. ఇంకా ట్రైలర్ కూడా రాక ముందే యూఎస్ లో తమిళ సహా తెలుగు ప్రీ సేల్స్ లో హాఫ్ మిలియన్ మార్క్ ని ఇంకా చాలా రోజులు సమయం ఉన్నప్పటికీ కొట్టేసింది. దీనితో లియో పై ఉన్న హైప్ కోసం ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. దీనితో అయితే రిలీజ్ నాటికి ఈ మార్క్ 1 మిలియన్ కంటే ఎక్కువే ఉంటుంది అని చెప్పడంలో సందేహం లేదు. ఇక ఈ భారీ చిత్రానికి అనిరుద్ సంగీతం అందిస్తుండగా 7 స్క్రీన్ సినిమాస్ వారు నిర్మాణం వహించారు.

bahujan bazaar
బహుజన బజార్
www.bahujanbajaar.in
bahujan bazaar



మిత్రులందరికీ జై భీం,

మన పోరాట యోధురాలు ఝల్‌కరీ భాయీ చరిత్రను వక్రీకరించి ఝాన్సీలక్ష్మీబాయి చరిత్రను మన చేత ప్రచారం చేయించిన విషయం మీకు తెలుసు దీనకి కారణం మన రచయితలను మనం ప్రోత్సహించకపోవడం. అదేవిధంగా మన రచనలు ప్రతి ఊరులో అందుబాటులో లేకపోవడం వల్ల మన బహుజనవాదం వెనుకబడుతున్న విషయం కూడా మన అందరికి తెలుసు.

అందువల్ల బహుజన రచనలను అన్నింటిని మీరు ఆర్డరు చేసిన వెంటనే మీకు అందించే విధంగా చేద్దాం. బహుజన రచయితలను ఆర్థికంగా బలోపేతం చేయడం వల్ల మన చరిత్రలను వెలికితీసే విధంగా చేద్దాం. పుస్తకాలను కొనండి, చదవండి, హాస్టల్ పిల్లలకు బహుమానం ఇవ్వండి.

లాభాలు

బహుజన బజార్‌లో పుస్తకాలు కొనండి, చదవండి, చదివించండి. హాస్టల్ పిల్లలకు బహుమతిగా ఇవ్వండి

ఉచితం: రూ.1000/- తో సభ్యత్వం తీసుకున్న వారికి సంవత్సర కాలంలో పుస్తకాల రవాణా ఖర్చులు ఉచితం.
రూ.500/- లకు పైన కొనుగోలు చేసే పుస్తకాలపై రవాణా ఖర్చులు ఉచితం.

ప్రతి యొక్క బహుజనుడు కనీసం ఒక పుస్తకాన్ని కొని హాస్టల్ పిల్లలకు ఉచితంగా ఇచ్చి బహుజనాభివృద్ధి తోడ్పడండి.

జై భీం, జై ఫూలే, జై బహుజన

డాక్టర్ కె.శివ భాగ్యారావు బహుజన IRS-vrs
చైర్మన్, స్నేహ గ్రూప్

Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2/29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989